పరమ పూజ్య గురుదేవులు, పరమ వందనీయ మాతాజీల
దివ్య ఆశీస్సులు మీపై అమృతధారలా వర్షించాలని మనసారా వాంఛిస్తూ
మీకు సమర్పిస్తున్నది.....



ఓం భూర్భువ: స్వ: తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోన: ప్రచోదయాత్।

# గాయత్రి యొక్క 24 శక్తిధారలు
## యంత్రములు వాటి మర్మము




హిందీమూలం:
**బ్రహ్మవర్చస్ శోధ్ సంస్థాన్**
శాంత్‌కుంజ్-హరిద్వార్

తెలుగుసేత :
**డా. తుమ్మూరి**
గాయత్రీ శక్తిపీఠం, నారాకోడూరు.

ప్రచురణ:
**గాయత్రీ చేతనా కేంద్రం**
అశ్విని హౌస్ దగ్గర, హెచ్.పి.రోడ్, మూసాపేట
హైదరాబాద్ - 500 018.
ఫోన్: 040-2370072, సెల్ : 9949111175



₹ 40/-

# ముందుమాట

గాయత్రీ మహావిద్యను సృష్టికి ఆధారభూతమైన ప్రాణవిద్యగా చెప్పబడింది. బృహదారణ్యకోపనిషద్ ( 5 . 14 . 4 )లో ఈ విధంగా ఉన్నది–

**"సా హైషా గయాంస్తత్రే ప్రాణా వై గయా:। తత్ప్రాణాంస్తత్రే। తద్యద్ గయాంస్తత్రే తస్మాద్ గాయత్రీ నామ।"**

అర్థము : **గాయత్రి ప్రాణములను కాపాడింది. ప్రాణములే గయ. ఆ ప్రాణములను యిది కాపాడింది కావున దీని పేరు గాయత్రి.** ఛాందోగ్యోపనిషద్ (3 . 12 . 1) లో విశ్వబ్రహ్మాండములో ఉన్న అంతటికి మూలాధారము గాయత్రియే యని చెప్పబడినది.

**"గాయత్రి వా ఇదమ్‌సర్వ భూతం యదిదం కించ।"**

చతుర్వింశత్యక్షరా గాయత్రీ – ఐతరేయ బ్రాహ్మణం 3 – 39

గాయత్రీ మంత్రములోని 24 అక్షరములు ఈ మహావిద్య యొక్క ఒక్కొక్క విశిష్ఠధారకు ప్రతీకలు, ప్రతినిధులు. గాయత్రీ యొక్క 24 శక్తుల దేవ ప్రతిమలు **శాంతి కుంజ్ – బ్రహ్మవర్చస్ శోధ్ సంస్థాన్‌లో** విధి విధానంతో స్థాపించబడినవి. దేవ ప్రతిమల స్వరూపము ఆయుధములు, వాహనములు మొ॥వాటి వివేచనకూడా బొమ్మలకు ఎదురుగా దీనిలో జతపరచాము.

దేవశక్తుల స్వరూపములను వాటి మానవాకృతి – 'మూర్తి', రేఖాకృతి – 'యంత్రము' రూపములో చిత్రించే సాంప్రదాయమున్నది. ఈ పుస్తకములో 24 దేవ ప్రతిమలతో పాటు, వాటికి సంబంధించిన యంత్రములు, మంత్రాక్షరములు, గుణములు, ఫలశ్రుతులు మొదలైనవి చిత్రించబడినవి. ప్రతిమలతో పాటు సంక్షిప్త వివేచన యివ్వబడింది.

**గాయత్రీ మహాశక్తి ఈ దిశలో జనులలో శ్రద్ధ మేల్కొలిపి, జన మానసాన్ని జాగృతం చేస్తే, వ్యక్తి – సమాజం రెండింటికి ఉజ్వల భవిష్యత్తు లభిస్తుంది.**

ఈ సచిత్ర పుస్తకం తనకు తాను పూర్ణము. దేవశక్తులకు సంబంధించి అధిక జిజ్ఞాస కలిగిన వారందరికీ యిది కరదీపిక కాగలదు.



## విజ్ఞాన, ఆధ్యాత్మికముల విశిష్ఠ సమ్మేళనం "బ్రహ్మవర్చస్" పరిశోధనాలయం

ఈ పుస్తకంలో మీరు చూసిన గాయత్రీ 24 శక్తిధారల మూర్తి రూపాలు శాంత్‌కుంజ్ –హరిద్వార్ అనుబంధ సంస్థ అయిన బ్రహ్మవర్చస్ పరిశోధనాలయం లో ప్రతిష్ఠించబడిన మూర్తుల ఛాయాచిత్రాలు. **ఆధ్యాత్మికతను విజ్ఞాన సమ్మతంగా నిరూపించే మహోద్దేశంతో** ఈ పరిశోధనాలయం పరమ పూజ్య గురుదేవులచే 1984లో స్థాపించబడింది. ఇందులో చికిత్సా విజ్ఞాన, మనోవిజ్ఞాన, పదార్థ విజ్ఞాన రంగాలలో పరిశోధనలు నిర్వహించబడుతూ, ఫలితాలు విశ్వమానవ కళ్యాణం కొరకై వినియోగించబడుతున్నాయి. ఇందులో కల్పసాధకులు, యుగశిల్పిసాధకులు, ఆహార నియమము, జప–అనుష్ఠానములు, వర్ణధ్యానము, నాదయోగము, త్రాటకము మొదలైన ప్రయోగాలు చేశారు, చేస్తున్నారు. గాయత్రీ మంత్రము యొక్క శబ్దశక్తి, యజ్ఞం రూపంలో పదార్థము యొక్క కారణశక్తుల ప్రతిపాదనలు ఇక్కడినుండియే చేయబడ్డాయి. ఈ విషయాలపై ప్రపంచమంతటా ప్రయోగాలు నేడు విస్తృతంగా జరుగుతున్నాయి.

గ్యాస్ లిక్విడ్ క్రొమాటోగ్రఫీ, ఫంక్షనల్ డిస్టిలేషన్, సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్షన్ పద్ధతులలో వనౌషధులయొక్క గుణగణాలు ప్రమాణితం చేయబడుతున్నాయి. వాటిని సూక్ష్మీకృత రూపంలో చూర్ణము, క్వాథ–ఫాంటము, బాష్పీభూత అగ్నిహోత్ర ధూమం రూపంలో ప్రయోగించడం, సమగ్ర ఆరోగ్యం కొరకు ప్రయోజనకరం (హోలిస్టిక్ హీలింగ్), మంత్ర ఉచ్చారణ, శ్రవణముల వలన శరీర అంగ ప్రత్యంగాల మీద ప్రభావం,వివిధ వర్ణముల (స్పెక్ట్రమ్‌లోని ఏడు రంగులు) ప్రకాశజ్యోతిపై ధ్యానించడం వలన శరీర విద్యుత్తుపై ఏర్పడే ప్రభావం, వీటిని గమనించేందుకు మల్టీఛానల్ పాలిగ్రఫీ, బయోఫీడ్‌బ్యాక్ ఎలక్ట్రోయన్ పాలిగ్రఫీ, ఎలక్ట్రో కార్డియోగ్రఫీ, సైకోమెట్రీ లను వినియోగిస్తారు. రక్తములోని తెల్లకణాలు, విభిన్న హార్మోనులు, ఎంజైములు, జీవనీశక్తిని పెంపొందించే ద్రవ్యములు, ఊపిరితిత్తుల రక్తశోధన ప్రక్రియ, ప్రాణాయామం, ఆసనాలు, ముద్రలు, బంధాలు వగైరాలు స్పెక్ట్రోఫొటోమీటర్, ఎలక్ట్రో ఫ్లోరిసిస్, ఆటో ఎనలైజర్, స్పయరోమెట్రీ మొదలైన ప్రయోగాలతో పరీక్షింపబడతాయి. ఈ యంత్రాలన్నిటినుండి సేకరించిన వివరాల విశ్లేషణకంప్యూటర్ల సహాయంతో జరుగుతుంది.

ప్రస్తుతం డా॥ ప్రణవ్ పండ్యా నిర్దేశికత్వంలో శాంత్‌కుంజ్ అనుబంధ సంస్థగా ఉన్న ఈ పరిశోధనాలయం తప్పక దర్శించదగినది.

# 1. ఆదిశక్తి గాయత్రి

బ్రహ్మ ఒక్కటే. దాని ఇచ్ఛా క్రీడ – కల్లోలితమైనది. అది ఏకము నుండి అనేకం కావాలని కోరుకున్నది. ఈ కోరుకోవడముతో ఇచ్ఛయే శక్తియైనది. ఇచ్ఛాశక్తియే సర్వోపరి. దాని సామర్థ్యము వలననే ఈ సమస్త ప్రపంచము తయారైనది. జడ – చేతన సృష్టికి ముందు పరబ్రహ్మ యొక్క ఏ ఆకాంక్ష ఉదయించిందో, దానినే బ్రాహ్మీశక్తి అని అన్నారు. అదియే గాయత్రి. సంకల్పముతో ప్రయత్నము, ప్రయత్నము నుండి పదార్థము, ఈ క్రమము సృష్ట్యాది నుండి ఉన్నది. అనంతకాలం నుండి కొనసాగుతూ ఉన్నది. ప్రత్యక్షముగా పదార్థమే కనపడుతుంది. పదార్థము యొక్క మూలశక్తి అణు సంఘటన మీద ఆధారపడి ఉన్నదని సూక్ష్మదర్శులైన వైజ్ఞానికులకు తెలుసు. విద్యుత్తు రంగములతో తయారైన గుత్తివంటిది అణువు తప్ప మరేమీ కాదు. ఇది సూక్ష్మము. లోతుకు వెళ్ళిన తత్వదర్శులైన ఆధ్యాత్మవేత్తలకు విశ్వవ్యాప్తమైన విద్యుత్తురంగములు కూడా స్వతంత్రము కావని, బ్రహ్మ చేతన యొక్క ప్రతిక్రియ మాత్రమేనని తెలుసు. జడ జగత్తులోని పదార్థ సంపదలో సువ్యవస్థ విద్యామానమై ఉన్నదని ప్రకృతి శాస్త్రజ్ఞులకు బాగా తెలుసు. ఈ సామర్థ్యం యొక్క ప్రేరణతో సృష్టి యొక్క సమస్త కదలికలు ఏదో విశిష్ఠ ఉద్దేశ్యముతో గతిశీలమై ఉన్నాయి. ఇదే ఆదిశక్తి – దీనినే గాయత్రి అని అన్నారు. సాక్షి, ద్రష్ట, నిర్వికార, నిర్వికల్ప, అవినాశి, నిరాకార, వ్యాపక బ్రహ్మ యొక్క సృష్టి వ్యవస్థ ఏ సామర్థ్యం సహాయంతో నడుస్తున్నదో అదియే గాయత్రి.

గాయత్రి త్రిపద. గంగా, యమున, సరస్వతి యొక్క సంగమాన్ని తీర్థరాజమని అంటారు. గాయత్రి మంత్ర రాజము. సత్ – చిత్ – ఆనంద, సత్యం–శివం–సుందరం, సత్వారజస్తమో గుణాలు, ఈశ్వర–జీవ–ప్రకృతి భూలోక భువర్లోక స్వర్లోకముల విస్తారమే త్రిపద. పదార్థములలో ఘన ద్రవ భాష్ప, ప్రాణులలో జల, స్థల, నభ చర సృష్టిక్రమం యొక్క ఉత్పాదన అభివర్ధన పరివర్తన గాయత్రి యొక్క మూడు క్రమాలు. చలి, వేడి, వర్షఋతువులు, దినము రాత్రి సంధ్య మూడు కాలములలో మహాకాలుని కదలికలు చూడవచ్చు.



ప్రాణాల్ని కాలాగ్ని యోగాన్ని రూపంలో త్రిపద యొక్క శక్తి వ్యాప్తమై యున్నది. సృష్ట్యాదిలో బ్రహ్మ యొక్క ప్రకటీకరణయైనది – అది ఓంకారము. ఓంకారములోని మూడు భాగములు. – అ, ఉ, మ, దాని మూడు విస్తారములు భూః, భువః, స్వః దానికి మూడు పాదములు. ఈ ప్రకారముగా **శబ్ద బ్రహ్మయే పల్లవించి గాయత్రి మంత్రమైనది.**

పౌరాణిక కథానుసారము సృష్ట్యాదిలో విష్ణువు నాభి నుండి ఉత్పన్నమైన కమలము నుండి బ్రహ్మ ప్రకటితమైనాడు. వారికి ఆకాశవాణి ద్వారా గాయత్రి మంత్రము లభించింది. దాని ఉపాసనతో సృజనాత్మక సామర్థ్యము పొందుమని ఆదేశము ఇవ్వబడింది. బ్రహ్మ నూరు సంవత్సరములు గాయత్రి తపస్సు చేసి సృష్టి రచనాశక్తిని ప్రాప్తించుకొన్నాడు. ఈ కథ కూడా శబ్ద బ్రహ్మవలెనే గాయత్రియే ఆదిశక్తియని ఋజువు చేస్తున్నది. జ్ఞానయోగము, కర్మయోగము, భక్తియోగముల ద్వారా ప్రపంచము యొక్క సమస్త ఆలోచనా సంపద, భావ వైవిధ్యము గాయత్రి పరిధిలోనే సన్నిహితమై ఉన్నవి.

ఆదిశక్తితో సంబంధం పెట్టుకొని సాధకుడు సృష్టి సమీపము వరకు వెళ్ళగలుగుతాడు. పరబ్రహ్మలో ఉన్న విశేషతలతో సంపన్నుడవుతాడు. పరబ్రహ్మదర్శనము, విలయమే జీవిత లక్ష్యము, ఆదిశక్తి సహాయము ద్వారానే ఈ ప్రయోజనము సంభవము.

ఆదిశక్తి సాధకునిలో ఋతుంభర ప్రజ్ఞా రూపంలో అవతరిస్తుంది, సాధకుడు బ్రహ్మర్షియవుతాడు. నర–పశు ప్రవృత్తులు, వాసనలు, తృష్ణ అహం యొక్క కుచక్రంలో పరిభ్రమిస్తూ ఉంటాయి. నర దేవతల అంతరాత్మలలో నిష్ఠ ప్రజ్ఞ శ్రద్ధ యొక్క ఉన్నత స్థాయి విశ్వాసము ప్రగాఢమయి, పరిపక్వమవుతూ పోతుంది. నిష్ఠ అనగా సత్కర్మ, ప్రజ్ఞ అనగా సద్జ్ఞానము. శ్రద్ధ అనగా సద్భావము. వీటి యొక్క సుఖపరిణామాలుగా తృప్తి, తుష్టి శాంతి రూపంలో సాధకునికి లభిస్తాయి. తృప్తి అనగా సంతోషము, తుష్టి అనగా సమాధానం, శాంతి అనగా ఉల్లాసము. ఉన్నతస్థాయి భావ సమావేశము ఉపలబ్ధిని పొంది సాధకుడు ఎల్లవేళలా తన విశ్వాసములో ఆనందపరవశుడవుతాడు. శోక సంతాపాల నుండి పూర్తి విముక్తి లభిస్తుంది. ఆదిశక్తి శరణాగతి కొరకు వేసే ప్రతి ముందడుగు సాధకునికి ఈ విభూతులతో లాభాన్వితుని చేస్తుంది.

# ౨. బ్రాహ్మీ

త్రిమూర్తులు ప్రసిద్ధులు – బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుడు ఉత్పాదన, అభివృద్ధి, పరివర్తన. వీరినే 'బ్రాహ్మీ' అని చెప్పవచ్చు. ప్రపంచం యొక్క పెద్ద విశేషత ఏమిటంటే సృజన ఉత్పాదనలో సంలగ్నత. ఈ సామర్థ్యము భూమిలో, తల్లిలో ఉన్నది. తమ ఉత్పాదనల ద్వారా ఇతరులకు లాభము చేకూర్చి, స్వయంగా ధన్యులయ్యే ఈ ఉత్కృష్టత కారణంగానే భూమాత, జన్మనిచ్చే తల్లి గౌరవాన్వితులైనారు. ఇది బ్రాహ్మీమాత అనుదానమే. ఎవరు ఎంత మోతాదులో దీన్ని పొందుతారో వారు అదే నిష్పత్తిలో మాహామానవులవుతూ పోతారు. ధ్వంసము–దానవుల, సృజన–దేవతల సిద్ధాంతం. ఇందువలన సృజన క్రియలో సంలగ్నమయ్యే మనుష్యులనే దేవమానవులని పిలుస్తారు. గాయత్రీ యొక్క బ్రాహ్మీశక్తి సాధనతో సాధకునిలో బ్రహ్మ తేజస్సు, బ్రాహ్మణత్వము వికసిస్తాయి. బ్రాహ్మణులు పృథ్విపై దేవతలుగా భావించబడతారు. వారిని భూదేవులని అంటారు.

సత్–రజో–తమోగుణాలలో, సత్యం–శివం–సుందరములో ప్రథమ వర్ణము సత్, సత్యము. ఇదే బ్రాహ్మీ యొక్క విశేషత దాని మీద ఆధారపడుట వలన వ్యక్తిత్వం, స్వభావంలో సత్త్వగుణం పెరుగుతుంది. ఆచార వ్యవహారాలలో సత్త్వగుణం యొక్క పవిత్రత, నిరాడంబరత యొక్క అనుదానం నిరంతరం పెరగుతూ పోతుంది.

బ్రాహ్మీ హంసవాహిని. ఆమెవొక చేతిలో పుస్తము, రెండవ చేతిలో కమండలము ధరించింది. ఆమె కన్య ప్రాయములో ఉన్నది. ఈ అలంకారాల ద్వారా బ్రాహ్మీశక్తిని అర్థం చేసుకోవటంలో సహాయం లభిస్తుంది. ఆమె అనుగ్రహం పొందటానికి ద్వారాలు తెఱుచుకుంటాయి. గాయత్రి వాహనం సామాన్య హంస కాదు. మనుష్యులో కనిపించే రాజహంస, పరమహంస. రాజహంస మర్యాద పూర్ణత, సజ్జనత్వము, శ్రేష్ఠత, ఆదర్శములకు ప్రతీక. పరమహంస తత్వజ్ఞాని, తపస్వి, పారమార్థికుడు, జీవన్ముక్తుడు. గాయత్రీ



ఉపాసన ఆధారంగా సాధకుడు సామాన్య మానవుని స్థాయి నుండి ఎదిగి రాజహంస అవుతాడు. సాధన పరిపక్వత ఆధారంగా పరమహంస స్థితి వరకు ఎదుగుతాడు. దేవాత్మ సిద్ధ పురుషుల రూపంలో దృష్టి గోచరమవుతుంది. నీరక్షీర వివేకము హంస యొక్క ప్రధాన గుణము. రెండవది ముత్యములే ఆరగించుట, కీటకములను ముట్టుకొనకపోవుట. ఇదే హంస ప్రవృత్తి. బ్రాహ్మీ చేతన యొక్క స్వరూపం ఇదే. గాయత్రి యొక్క వాహనం హంస అనగా హంస ప్రవృత్తి గల వ్యక్తులనే ఆ మహాశక్తి తన సమీపంలో ఉంచుకొంటుంది. మరొక తాత్పర్యమేమంటే ఈ ఉపాసన ఫలస్వరూపంగా సాధకుని సత్త్వగుణం క్రమంగా పెరుగుతూ పోతుంది.

పుస్తకము సద్ జ్ఞానానికి, కమండలం సత్కార్యానికి ప్రతీక. గాయత్రీ శక్తి యొక్క రెండు చేతులలో ఈ వరదానాలు ఉంచబడ్డాయి. బ్రాహ్మీసాధన వలన అంతఃకరణలో ఉత్కృష్ట చింతనా తరంగాలు తలెత్తుతాయి. క్రియా కలాపాలలో సత్కర్మ చేసేందుకు ఉల్లాసము సాహసము కలుగుతాయి. గాయత్రిని బ్రాహ్మణుల కామధేనువని అన్నారు. దాని తాత్పర్యమేమిటంటే బ్రాహ్మీశక్తి అనే కామధేనువు పయఃపానం చేసే సాధకులు నిజమైన అర్థంలో బ్రాహ్మణులవుతారు. ఆత్మసంతోషము, లోకగౌరవము, దైవీ అనుగ్రహము అనే మూడు వరాలు ప్రాప్తించుకొంటారు.

బుద్ధి, సిద్ధులపై అధికారము బ్రహ్మపరాయణులకే ఉంటుంది. ఎవరి బాహ్య, ఆంతరిక జీవనం పవిత్రమో అతనికే మంత్రసిద్ధి లభిస్తుంది. ఇందుకు ఆవశ్యకమైన పాత్రత గాయత్రీ యొక్క బ్రాహ్మీశక్తి సంపర్కం వలన ప్రాప్తిస్తుంది.

సావిత్రి సత్యవంతుల కథలో సావిత్రి సత్యవంతుణ్ని వరిస్తుంది. అతణ్ణి మృత్యుముఖం నుండి తప్పించుటయే కాక కట్టెలు కొట్టేవాని నుండి రాజును చేస్తుంది. సత్యవంతుడైన సాధకుడు సావిత్రి యొక్క నిజమైన సహాయము ప్రాప్తించుకొనుటకు బ్రాహ్మీశక్తి ఆధారంగా తగిన పునాది ఏర్పడుతుంది.

# ౩. వైష్ణవి

విష్ణువు యొక్క శక్తి వైష్ణవి అనగా పాలించేది. దీనిని నిర్వహణ అని కూడా అనవచ్చు. ఉత్పాదన ఆరంభం. అభివర్ధన మధ్యలోనిది. ఒకటి శైశవం, రెండవది యవ్వనం. యవ్వనంలో ప్రౌఢత, పరిపక్వత, సువ్యవస్థ కూడా భాగంగా ఉంటాయి. సాహసం, పరాక్రమాల కలయిక ఉంటుంది. ఇదే రజోగుణం. త్రిపదలోని రెండవ ప్రవాహం వైష్ణవి. దీనిని గంగకు సహకరించే యమున అని అనవచ్చు. దీని సాధన చేసే సాధకునికి ఈ సిద్ధులు, విభూతులు, సత్ప్రవృత్తులు ఉపలబ్ధి ఉంటుంది. దాని ఆధారంగా వాస్తవిక ప్రణాళికలు రూపొందించి సువ్యవస్థతో, తన్మయత మఱియు తత్పరతలతో పురోగమించుటలో సమర్థులవుతారు.

వైష్ణవిని మరొక అర్థంలో లక్ష్మి అని చెప్పవచ్చు. భౌతిక క్షేత్రంలో సంపన్నత యని, ఆత్మిక క్షేత్రంలో సుసంస్కారము అని పిలవవచ్చు. విభిన్న స్థాయిలలో సాఫల్యము దీని ఆధారంగానే లభిస్తుంది. వైష్ణవి యొక్క వాహనం గరుడుడు. గరుడునికి అనేక విశేషతలు ఉన్నాయి. మిగిలిన పక్షులతో పోల్చినపుడు దాని దృష్టి అధిక తీక్షణంగా ఉంటుంది. సుదూర ఆకాశంలో ఎంతో ఎత్తులో ఎగిరేటప్పుడు నేలమీద ప్రాకుతున్న సర్పాన్ని చూసి విద్యుత్ వేగంతో దాన్ని నోటకరిచి క్షణంలో ముక్కలు ముక్కలు చేస్తుంది. ఇతర పక్షులతో పోలిస్తే దీని గమనం అధిక తీవ్రం. సోమరితనం, నిర్లక్ష్యం దానికి క్రోసుల దూరం. జాగ్రత్తకు దానిని ప్రతీకగా భావించవచ్చు.



**అవ్యవస్థ అనే సర్పాన్ని ఘోర శత్రువుగా భావించి** దానిని తుదముట్టించడానికి విరుచుకుపడే స్వభావమే గరుడుడు. దూరదృష్టి కలిగినవారిని గరుడుడని అనవచ్చు. ఎవరికి సోమరితనము, నిర్లక్ష్యము ఉండవో వారే గరుడుడు. అటువంటి ప్రబల పరాక్రమవంతులకు గరుడుని వలె వైష్ణవి ప్రేమ ప్రాప్తిస్తుంది. వైష్ణవి ఉపాసన వలన సమృద్ధి పథం ప్రశస్తమవుతూ పోతుంది. ఈ సాధనా ప్రతిఫలం సంపన్నత. ఈ సాధకుల ఆంతరంగిక దారిద్ర్యం దూరమవుతుంది. వారు సద్గుణ సంపదలతో ధనికులవుతారు. వారిని వాస్తవికార్థంలో ఐశ్వర్యవంతులని అనవచ్చు. దానితోపాటు మానసిక దారిద్ర్యం, దుఃఖం నశిస్తుంది.

విష్ణువు యొక్క నారీస్వరూపం వైష్ణవి. ఆమె ఆయుధాలు కూడా నాలుగే – శంఖు, చక్రము, గద, పద్మము. నాలుగు చేతుల్లో ఈ నాలుగూ ఉంటాయి. రెండు చేతులు ఉన్నప్పుడు శంఖు, చక్రము మాత్రమే ఉంటాయి. శంఖు యొక్క అర్థము సంకల్పము, సునిశ్చయం యొక్క ప్రకటీకరణ, ఉద్ఘోష. చక్రము యొక్క అర్థము గతి, సక్రియత. గద యొక్క అర్థము శక్తి. పద్మము యొక్క అర్థము సుషమ (మిక్కిలి అందము), కోమలత్వము. ఈ నాలుగింటిని దేవగుణాలని అనవచ్చు. దేవతలు వరదానము, అనుదానం కూడా ఇస్తారు. విష్ణువు ఆయుధాలు వైష్ణవివి కూడా. ఎవరిలో ఈ నాలుగింటి ఆకర్షణ ఉంటుందో వారిపై వైష్ణవి కృప వర్షిస్తుంది. ఈ తథ్యాన్ని మరోరకంగా ఇలా చెప్పుకోవచ్చు. ఎవరిపై వైష్ణవి అనుగ్రహం వర్షిస్తుందో వారిలో ఆయుధాల రూపంలోపైన చెప్పుకొన్న నాలుగు సద్గుణాలు అదే నిష్పత్తిలో పెరుగుతూ పోతాయి.

# 4. శాంభవి

త్రిపద గాయత్రి యొక్క మూడవ ప్రవాహం శాంభవి. దీనిని ఉపయోగకర పరివర్తనా శక్తియని అనుకోవచ్చు. మరో విధంగా చెప్పుకోవాలంటే దీని కాయకల్ప సామర్థ్యంతో జీర్ణమైన దానిని నవీనంగా, మూర్ఛితమైన దానిని చైతన్యంగా, శిథిలత్వాన్ని సక్రియతగా మరణాన్ని జీవనముగా పరివర్తితం చేస్తుంది. పునర్జీవన నవనిర్మాణంగా చెప్పుకోవచ్చు. అశక్తుణ్ణి శక్తివంతుడుగా, కురూపిని సౌందర్యవంతుడుగా చేయుటలో నిరంతరం సంలగ్నమయ్యే శక్తియే గాయత్రి యొక్క శాంభవీ శక్తి. దీనినే శివశక్తి అనికూడా అనవచ్చు.

శాంభవికి రెండు ఆయుధాలు ఉన్నాయి. త్రిశూలము, డమరుకము. త్రిశూలమంటే మూడు మొనలు ఉన్న ఆయుధం, అది మనుష్యుని ఆదిభౌతిక, ఆధ్యాత్మిక, ఆధిదైవిక విపత్తులను హరించుటలో పూర్తి సమర్థత కలిగి ఉన్నది. మనుష్య జీవనంలో అనేక కష్టాలను కలిగించగల కారణాలు మూడు 1. అజ్ఞానము, 2. అభావము (లేమి) 3. అశక్తత. ఈ మూడింటిని నివారించేందుకు శాంభవి ఉపాసకుడు త్రిశూలధారి యవుతాడు. ఈ సాధనలో పూర్తి నిమగ్నత ఉంటే వ్యక్తిత్వంలో ప్రతిభా వికాసం కలిగి దానితో వెనుకబడిన మనఃస్థితి, మఱియు పరిస్థితి తిరుగబడి సమృద్ధము, సమున్నతము అవుతుంది.

డమరుకము జాగరణ, ఉత్సాహము, ముందడుగుకు ప్రతీక. శాంభవి ఒక చేతిలో డమరుకము ఉండుట కర్థము ఈ శక్తి ప్రవాహం యొక్క సంపర్కంలోనికి వస్తే నవజాగృతి యొక్క పురుషార్థం, కృషిలో ఉత్సాహం, ఎత్తుకెదగటానికి, పురోగమించటానికి కావలసిన సాహసం ఉత్పన్నమవుతుంది.



శాంభవి యొక్క వాహనం వృషభం. శివునికి తన ప్రకృతికి అనురూపంగా అన్ని ప్రాణులలో ఇదే నచ్చింది. వృషభం బలిష్టము శ్రమశీలి, సౌమ్యము మఱియు సహిష్ణువు. దానిశక్తి సృజనాత్మక ప్రయోజనాలలో లగ్నమై ఉంటుంది. సమర్థమై తన సామర్థ్యాన్ని పూర్తిగా సృజనాత్మక ప్రయోజనాలలో వినియోగిస్తుంది. ధ్వంస క్రియలో దానిశక్తి దాదాపుగా ఉపయోగించబడదు. శ్రమ, సాహసము, ధైర్యము, సౌజన్యములకు ప్రతీక వృషభము. ఈ గుణాలు ఎవరిలో, ఎంత ఎక్కువగా ఉంటాయో ఆ మోతాదులో శాంభవి యొక్క స్నేహము, సహకారము లభిస్తాయి. ఈ సత్ప్రవృత్తుల సంవర్ధనకు శాంభవీ ఉపాసన చేయబడుతుంది.

శాంభవీ మస్తిష్కం మధ్యలో మూడవ కన్ను ఉన్నది. దీని అర్థము దివ్యదృష్టి, దూరదృష్టి యొక్క ఉద్గమ శ్రోతస్సు, దీనినే జ్ఞానచక్షువు అని చెప్పవచ్చును. అతీంద్రియ శక్తుల సందర్భంలో, దూరదృష్టి, పరోక్ష దర్శనం, భవిష్యద్దర్శనం మొదలైన వాటికి దీనిని కేంద్రస్థానంగా భావించబడుతుంది. ఇదే తత్వదర్శుల బిందు సాధన యొక్క ఆజ్ఞాచక్రం. ఇది తెఱచుకోవటంతో అశుభాలు, అరిష్టాలు హరించిపోతాయి. భగవాన్ శంకరుడు ఈ తృతీయ నేత్రం తెఱచి కామదేవుని పరాజితుడ్ని చేశాడు. దమయంతి దీనిని తెఱచే బోయవానిని బూడిద చేసింది. ఇది ఆజ్ఞాచక్రంలో దాగిఉన్న శాప సామర్థ్యానికి ప్రతీక. మరొక వ్యాఖ్యానమేమిటంటే తృతీయ నేత్రము - ఆజ్ఞాచక్ర జాగరణతో వివేక శీలత వికసిస్తుంది. దానితో కషాయ, కల్మషాలను, హానిని స్పష్టంగా చూడగలుగుతాము. సామాన్య మానవులు తక్షణ లాభం కోసం భవిష్యత్తును పోగొట్టుకొంటారు, కానీ జాగృత వివేకంతో భవిష్యత్పరిణామాలను చూడగలుగుట వలన, దానికనుకూలంగా వర్తమాన కార్యకలాపాలను నిర్ధారించుకోగలుగుతాము. ఈ పద్ధతి, సూత్రము వలన సామాన్య మానవులు అసామాన్యులు, మహామానవులయ్యే అవకాశం లభిస్తుంది. శాంభవీ ఉపాసన వలన జ్ఞానచక్షువు తెఱచుకొని, దానివలన అర్జునునికి వలె ఆత్మదర్శనం, బ్రహ్మదర్శన లాభం దొరుకుతుంది. సామాన్య ప్రజల కల్పన, ప్రకృతికి సర్వదా భిన్నమైన అద్భుత కల్పనా సామర్థ్యం (ప్రతిభ) కలుగుతుంది.

# 5. వేదమాత

24 అక్షరాల వ్యాఖ్యానము కొరకు వేదాలు ఉత్పన్నమయ్యాయి. అందువలన గాయత్రిని వేదమాత అని అన్నారు. బ్రహ్మదేవునికి ఆకాశ వాణి ద్వారా గాయత్రి మంత్రము యొక్క బ్రహ్మదీక్ష లభించింది. వారికి తమ ఉద్దేశ్యపూర్తికి సామర్థ్యము, జ్ఞానము, విజ్ఞానము, శక్తి, సాధనల అవసరం కలిగింది. అభీష్ట సామర్థ్య ప్రాప్తికోసం వారు గాయత్రి తపస్సు చేశారు. తపోబలంతో సృష్టి నిర్మాణమైనది. సృష్టి సంపర్కము ఉపయోగం, రహస్యముల నుండి లాభాన్వితులగుటకు ఒక సునియోజిత విధి వ్యవస్థ ఏర్పాటయినది. దానిని వేదమన్నారు. వేద సంరచనకు మనఃస్థితి, పరిస్థితిని ఉత్పన్నము చేయుట గాయత్రి మహాశక్తి సహాయముతోనే సాధ్యమైనది. అందుకే ఆ ఆదిశక్తికి వేదమాత అని పేరు పెట్టారు.

వేదము సువిస్తృతము, దానిని జనసాధారణమునకు అర్థమయ్యేందుకు మరింత విస్తృతము చేయవలసి వచ్చింది. పురాణ కథానుసారము బ్రహ్మదేవుని నాలుగు ముఖముల నుండి గాయత్రీ నాలుగు చరణముల వ్యాఖ్య చేయగా నాలుగు వేదములైనవి.

'ఓం భూర్భువః స్వః' శీర్షభాగము వ్యాఖ్య నుండి ఋగ్వేదము అయినది. 'తత్సవితుర్వరేణ్యం' యొక్క రహస్యోద్ఘాటన యజుర్వేదములోనున్నది. 'భర్గోదేవస్యధీమహి' యొక్క తత్వజ్ఞాన విమర్శ సామవేదములోనున్నది. 'ధియోయోనః ప్రచోదయాత్' యొక్క ప్రేరణలు, శక్తుల రహస్యం అధర్వణ వేదములో నిండి ఉన్నది.

విశాలకాయముతో కూడిన వృక్షము యొక్క పూర్తిశక్తి చిన్న విత్తనములో నిక్షిప్తమై ఉంటుంది. పరిపూర్ణ మనుష్యుని సమగ్ర బలము చిన్నదైన శుక్రాణువులో సమావిష్ఠమై ఉండుట చూడవచ్చు. విశాల కాయమైన సౌర మండలం యొక్క సమస్త తత్వము, క్రియాకలాపాలు పరమాణువు యొక్క నగణ్య విభాగంలో నిండి ఉన్నాయి. సరిగ్గా అదేవిధంగా ప్రపంచములో వ్యాపించి ఉన్న సువిస్తృత జ్ఞాన విజ్ఞానము యొక్క సమస్త అంశాలు వేదములలో విద్యామానమై ఉన్నవి. ఆ వేదాల సారతత్వము గాయత్రీ మంత్రములో సారరూపములో నిండి ఉన్నవి. ఇందువలన గాయత్రిని జ్ఞాన విజ్ఞానముల అధిష్ఠాత, వేదవాఙ్మయమునకు జన్మధాత్రి అని చెప్పవచ్చు. శాస్త్రములలో అసంఖ్య స్థానాలలో దానిని వేదమాత అని చెప్పబడింది.



గాయత్రి మంత్రమును అవగాహన చేసుకొనుటచే అబ్రహ్మజ్ఞానము సాధకునికి సరళతాపూర్వకంగా లభిస్తుంది. దానిని హృదయంగము చేసుకొనుటకే వేదముల సంరచన జరిగింది. గాయత్రి మహాత్మ్యమును వర్ణిస్తూ మహర్షి యాజ్ఞవల్క్యులు ఇలా వ్రాశారు. "గాయత్రి విద్యను ఆశ్రయించినవారు వేదజ్ఞాన ఫలాన్ని పొందుతారు. వేదవిద్యా పారాయణ ఎందుకైతే చేస్తామో ఆ స్ఫురణలు గాయత్రి వలన అంతఃకరణలో అనాయాసంగా కలుగుతాయి".

వేదము జ్ఞాన విజ్ఞానముల రెండింటి భాండాగారము. ఋక్కులలో ప్రేరణాప్రద అర్థమే కాక, ఆ శబ్ధ గుచ్ఛకములలో రహస్యమయ శక్తి యొక్క అదృశ్య భాండారమున్నది. వేదములలో విజ్ఞానము కూడా నిండి ఉన్నది. స్వర శాస్త్రాలననుసరించి, నిర్ధారిత స్వర విజ్ఞాన్నానుసరించి ఋక్కులను పఠిస్తే, ఉచ్ఛరిస్తే సాధకుని అంతఃకరణ స్థాయి ఎదిగి దానిలో దివ్యప్రేరణలు అవతరిస్తాయి. వారి వ్యక్తిత్వములో ఎటువంటి ఓజస్సు, తేజస్సు మఱియు వర్ఛస్సు ప్రకటితమవుతాయంటే, దాని సహాయముతో మహోన్నత కార్యములు చేయగల్గిన శౌర్యము, సాహసము ఉత్పన్నమవుతాయి. వాతావరణంలో అనుకూల ప్రవాహం పరివర్తన సంభవం చేయగలిగే రహస్యము వేద మంత్రాలలో విద్యామానమై ఉన్నది. మంత్రముల ప్రచండ ప్రవాహ వర్ణన శాస్త్రాలలో లభిస్తుంది. ఈ రహస్య ప్రక్రియ వేదమాత పరిధిలో సమ్మిళితమని తెలుసుకోవాలి.

వేదజ్ఞానమును దూరదర్శి, దివ్యదృష్టియని అంటారు. దీన్ని ఆచరించే వారి మస్తిష్కము నిశ్చిత రూపంలో ఉజ్జ్వలంగా ఉంటుంది. నాలుగు వేదాలు నాలుగు మండలములు మాత్రమే కాదు. ఆ జ్ఞానము విస్తారము చేయుట వలన బ్రహ్మదేవునికి నాలుగు ముఖములైనవి. వారి వైఖరి, మధ్యమ, పరా, పశ్యంతి నాలుగు వాణులు సమస్త విశ్వానికి దిశా నిర్దేశము చేయుటలో సమర్థమైనవి. గాయత్రిని అవగాహన చేసుకొన్న నలుగురు ఋషులు సనక, సనందన, సనాతన, సనత్కుమారులు వేద భగవానుని ప్రత్యక్ష అవతారములుగా చెప్పబడ్డారు. నాలుగు వర్ణములు, నాలుగు ఆశ్రమముల పరంపర వేదముల ఆచార పద్ధతి. మనస్సు బుద్ధి చిత్తము, అహంకారముల అంతఃకరణ చతుష్ఠయం దేనిని పొంది కృతకృత్యమవుతాయో అది వేదజ్ఞానమే. కామధేనువు నాలుగు స్థనముల నుండి ధర్మార్థ కామమోక్షముల నాలుగు విభూతుల పయః పానము చేస్తారు. సాధనా చతుష్ఠయంలో 'ప్రవృత్తి' ని వేదమాత యొక్క చతుర్విధ దివ్యప్రేరణగా భావించబడుతుంది. వేదమాత సాధకునికి నాలుగు వేదాల అవలంబన ప్రదానం చేస్తుంది. నిజమైన వేదవేత్తలను బ్రహ్మజ్ఞానులుగా చేస్తుంది. తత్త్వ జ్ఞానము, సద్జ్ఞానము, బ్రహ్మజ్ఞానము, ఆత్మజ్ఞానములతో సంపన్నులుగా చేస్తుంది.

# ౬. దేవమాత

గాయత్రిని దేవమాత అని కూడా అంటాము. ఆమె ఒడిలో కూర్చునేవారు, పయఃపానం చేసేవారు, కొంగు పట్టుకునేవారు తమ దేవత్వాన్ని పెంచుకుంటారు. ఆత్మోన్నతి మార్గంలో క్రమ వికాసం పొందుతూ, ఈ భూమి మీద సంచరించే దేవ మానవుల పంక్తిలో చేరుతారు. అందుకే ఆమె దేవమాత.

గాయత్రి మంత్రములోని 24 అక్షరాలలో ఎంతో విద్య దాగి ఉన్నది, వాని చింతన, మననము వలన చైతన్యములో నూతన జాగృతి ఉత్పన్నమవుతుంది. దేవతల సత్ప్రవృత్తులను అనుసరించుటలోనే మానవ జీవితము యొక్క సార్థకత, సాఫల్యము ఉన్నాయని మనస్సు అంగీకరిస్తుంది. అజ్ఞానాంధకారములో తిరిగేవారు మోహము, మమకారమనే రొంపిలో దిగబడిపోతారు. ఏడుస్తూ, మొత్తుకుంటూ జీవితాన్ని గడిపివేస్తారు. గాయత్రి ప్రకాశము అంతరాళములోనికి ప్రవేశించుటచే, వ్యక్తి సుషుప్తి నుండి విరక్తుడై జాగృతిలోకి ప్రవేశిస్తాడు. మనుష్యుని శరీరంలో దైవత్వం అవతరించుట అంటే స్వార్థాన్ని అదుపు చేసుకొని పరమార్థ ప్రయోజనంలో ఆనందించుట, ఆ దిశలో పురోగమించుటకు సాహసించుట – ఎవరు దైవీ సంపదలను ఏ మోతాదులో నింపుకుంటారో, వారు అదే మోతాదులో ఈ జీవితంలోనే స్వర్గ సుఖశాంతిని అనుభవిస్తారు. అతని వ్యక్తిత్వపు స్థాయి సమున్నతము, సుసంస్కృతము అవుతుంది. ఎవరు స్వయంగా ఉన్నతులవుతారో, పురోగమిస్తారో, తమతోపాటు ఇతరులను ఉన్నతులు పురోగాములుగా చేస్తారో వారిని దేవాత్మ అనే శబ్దంతో గౌరవిస్తారు. చందన వృక్షము వలె వారి ఉనికి వలన వాతావరణమంతా సుగంధితమవుతుంది. సమీపములోనికి వచ్చే ఇతర వ్యక్తులు కూడా ప్రయోజకులౌతారు.



గాయత్రి ఉపాసన వలన ప్రథమ ప్రతిఫలం దేవత్వం యొక్క అభివృద్ధి. సాధకుని లోపల, బయట దేవతా సమానమవుతుంది. ఒక్కొక్కటిగా దుష్ప్రవృత్తులు వెళ్ళిపోతాయి. ప్రగతి యొక్క ప్రతి అడుగులో సత్ప్రవృత్తుల లాభం కలుగుతుంది. ఆకురాలు కాలంలో ఆకులు ఒక్కొక్కటిగా రాలిపోయినట్లు, గుణ కర్మ స్వభావాలలో లోతుగా పేరుకుపోయిన కషాయ కల్మషాలు వదలిపోతాయి. వాటి స్థానంలో వసంతలో కొత్త చిగుళ్ళవలె మానవోచిత శ్రేష్ఠత్వం పెంపొందుతుంది.

ఇచ్చేవారిని దేవతలని అంటారు. గాయత్రి ఉపాసన సరియైన విధానంలో చేస్తే దేవత్వము మోతాదు పెరుగుతుంది. ఉత్కృష్ట వ్యక్తిత్వము, ఆదర్శవంతమైన ఆచరణ ఈ రెండూ దేవతల గుణాలు. అటువంటి వారు ప్రతిక్షణము తమ ప్రత్యక్ష, పరోక్ష అనుదానాలతో సత్యయుగ వాతావరణం కలుగజేస్తూ పోతారు.

దేవతలు ఎప్పుడూ యువకులుగానే ఉంటారు. మానసికంగా వారికి వృద్ధాప్యము రాదు. ముఖంలో ప్రసన్నత నిండి ఉంటుంది. సంతోషంతో కూడిన నిద్ర, ఆశ నిండిన ఆలోచనల్లో ఈదులాడుతూ ఉంటారు. ఏ పరిస్థితులలో కూడా దుఃఖము, ఉద్రేకం, నిరాశ, అసహనము వారిలో చూడలేము. ఈ విశేషతలున్న వారిని దేవ మానవులని అనవచ్చు. దేవతలు స్వర్గంలో ఉంటారు. ఆలోచనలో ఉత్కృష్టత, ఆశావాదములో ఉత్సాహము, ఆనందము సంతోషము ఇవన్నీ కలగలసి ఉంటాయి. దేవతల కోరికలన్నీ నెరవేఱుతాయి. కల్పవృక్షము వారి కోరికలన్నీ నెఱవేరుస్తుంది. ఎవరు తక్కువలో జీవించటానికి ఇష్టపడతారో, సదుద్దేశ్యములను ఎక్కువ కోరుకుంటారో వారందరికి ఈ స్థితి ప్రాప్తిస్తుంది. కాముకులు, తృష్ణ కలిగినవారు అహంకారులు మాత్రమే తృప్తి పొందరు. సద్భావనలు నెఱవేర్చుకొనుటకు మాత్రము అవకాశాలే అవకాశాలు. దేవత్వము మనఃస్థితిలో అవతరిస్తుంది. ఫలితంగా స్వర్గ సమానమైన, సంతోష జనక పరిస్థితులకు ఆలస్యం పట్టదు. దేవమాత గాయత్రి సాధకుణ్ని ఆ ఉన్నత స్థితికి లాక్కువెళ్తుంది.

# 7. విశ్వమాత

గాయత్రి యొక్క ఒక పేరు విశ్వమాత. తల్లికి తన సంతానం ప్రాణంతో సమానం. అందరూ ఐక్యంగా ఉండాలని, సమగ్రమైన సుఖము, సమున్నతి పొందాలని కోరుకుంటుంది. మనుష్యులందరూ కలసి మెలసి ఉండుటలోనే విశ్వమాత గాయత్రికి ప్రసన్నత ఉన్నది. క్షమించుట, ఆత్మీయతతో నిండిన సద్వ్యవహారము అనుసరించాలి. సమగ్ర సుఖ శాంతియుత వాతావరణం ఏర్పడాలి. మనుష్యులు ఇతర ప్రాణుల మధ్య కూడా సహృదయపూర్వక వాతావరణం ఉండాలి.

విశ్వమంతటా సత్యయుగ వాతావరణం రూపొందటానికి నిమిత్త కారణం గతంలోని సాంస్కృతిక శ్రేష్ఠత, భావపూర్వక సద్భావనలే. రాబోయే రోజుల్లో విశ్వమాత వాత్సల్యము మళ్ళీ సక్రియమవుతుంది. ఆమె తమ విశ్వవాటికలోని భాగాలనన్నిటినీ సుసంస్కారితము, సువ్యవస్థితము, సమున్నతము చేసేందుకు చురుకైన అవతార భూమిక నిర్వహిస్తుంది. విశ్వము యొక్క నవనిర్మాణంలో ప్రజ్ఞావతార రూపంలో ప్రస్తుత కృషి ఆ మహాశక్తి యొక్క వాత్సల్యము యొక్క ఒక రూపముగా భావించవచ్చును. రాబోయే రోజుల్లో “వసుధైవ కుటుంబకం” అందరికీ ఆమోదయోగ్యమవుతుంది. కలసి మెలసి ఉండుట, ఆదర్శం, సమానత్వము, మమత, పవిత్రత ఈ నాలుగు ఆదర్శాల ఆధారంగా వ్యక్తి, సమాజాల రీతి, నీతి తిరిగి రూపొందించబడుతుంది. ఒకే భాష, ఒకే ధర్మం, ఒకే దేశం, ఒకే సంస్కృతి నిర్మాణం జరుగుతుంది. జాతి, లింగ, ధర్మముల పేరుతో భేద భావం లేని, అసమానత లేని ఐక్యత, సమానత్వముల ఆధారంగా, ప్రాచీన కాలంలో వలెనే రాబోయే రోజుల్లో నూతన వ్యవస్థ ఏర్పడుతుంది.



పవిత్రత అనగా జీవన క్రమంలో సర్వతోముఖమైన మర్యాద పద్ధతి, మమత అనగా ఆత్మీయత సహకారము నిండిన సామాజిక వ్యవహారము. ప్రాచీన కాలంలో వలెనే, రాబోయే రోజుల్లో అటువంటి మనఃస్థితి, పరిస్థితి రూపొందించుటకు విశ్వమాత విశేష భూమిక విశేష రూపంలో నిర్వర్తిస్తుంది.

మస్తిష్కంపై శిఖా రూపంలో వివేక ధ్వజం ఎగురవేయబడుతుంది. శరీరాన్ని కర్తవ్య బంధనంలో బంధించటానికి భుజముపై యజ్ఞోపవీతం ధరింపచేయబడుతుంది. ఇవి రెండూ ప్రతీకరూపంలో గాయత్రి ప్రతిమలు.

భగవానుని విరాట్ రూప దర్శనం అనేక మంది భక్తులకు అనేక విధాలుగా అవుతూ ఉన్నది. విరాట్ బ్రహ్మ యొక్క తత్వదర్శనం యొక్క వ్యావహారిక రూపము – విశ్వ మానవుడు, విశ్వ బంధుత్వము, విశ్వ కుటుంబము, విశ్వ భావన, విశ్వ సంవేదన. దీనితో వ్యక్తివాదం నశిస్తుంది. సామూహికత మొలకెత్తుతుంది. ప్రభు సమర్పణమంటే ఇదే. సంకీర్ణ స్వార్థ బంధనాల నుండి విముక్తమై విరాట్‌తో ఐక్యత స్థాపించుకొనుట పరమ లక్ష్యంగా భావించబడింది. ఆత్మచింతన, బ్రహ్మచింతన, యోగాభ్యాసము, ధర్మానుష్ఠానము మొదలైన సాధనాత్మక ఉపచారాలన్నీ యిందు నిమిత్తమే చేయించబడుతాయి. జన జీవితంలో ఈ విశ్వాసాలు, ఈ సాంప్రదాయాల కలగలుపు యొక్క లక్ష్యము వ్యక్తిలో దేవత్వము ఉదయించుట, భూమిపై సుఖశాంతులతో స్వర్గీయ పరిస్థితి కల్గించుటయే. విశ్వమాత గాయత్రి ప్రవృత్తి, ప్రేరణ ఇదియే.

గాయత్రి మహాశక్తిని విశ్వమాత అంటాము. ఆమె ఒడిలో కూర్చునేవారిలో విశ్వకుటుంబం యొక్క ఉదాత్త భావన వికసిస్తుంది. క్షుద్రత యొక్క భవ బంధనాల నుండి ముక్తి, సంకీర్ణత అనే నరకం నుండి నివృత్తి – ఈ రెండు అనుదానాలు విశ్వమాత సామీప్యత వలన, అనుగ్రహం వలననే, నిజమైన సాధకుడు తనలో ఈ గుణాలు పెల్లుబుకుట చూడగలడు.

# 8. మందాకిని

కనిపించే గంగ కన్పించని గాయత్రిల మధ్య సమానత భావించబడింది. గాయత్రి యొక్క ఒక శక్తి పేరు మందాకిని. గంగ పవిత్రతను కలిగించి పాపకర్మల నుండి విముక్తినిస్తుంది. గాయత్రితో అంతఃకరణ పవిత్రమై కషాయ కల్మషాల నుండి విముక్తి లభిస్తుంది. గంగ, గాయత్రి రెండింటి యొక్క జన్మ, జయంతి ఒకటే జ్యేష్ఠ శుక్ల దశమి. రెండింటిని ఒకే తథ్యము యొక్క స్థూల సూక్ష్మ ప్రతీకలుగా భావించవచ్చును.

గంగ యొక్క అవతరణ భగీరథుని తపస్సుతో సంభవమైనది. గాయత్రీ అవతరణ కూడా బ్రహ్మ యొక్క అటువంటి ప్రయత్నం వలననే సాధ్యమైనది. మనుష్య జీవనంలో గాయత్రి యొక్క దివ్యధార అనుగ్రహం అవతరింప చేసుకోవటానికి తపస్వీ జీవనము, దానితోపాటు సాధన అవసరము. గాయత్రి యొక్క ద్రష్ఠ, ఋషి విశ్వామిత్రుడు. ఆయన కూడా తపశ్చర్య ద్వారానే ఈ గౌరవనీయ పదవి పొందాడు. విశ్వామిత్రుడు తాను సంపాదించిన గాయత్రి మహాశక్తిని బల-అతిబల మహావిద్యలు నేర్పించుట ద్వారా రామలక్ష్మణులకు అందించాడు. దానివలననే వారు ఇంత మహాపురుషార్థం నెరవేర్చుటలో సమర్థులైనారు. **బల, అతిబల గాయత్రి, సావిత్రి యొక్క పేర్లే.**

గంగ శరీరాన్ని పవిత్రం చేస్తే గాయత్రి ఆత్మను, గంగ మృతులను తరిపంచేస్తే, గాయత్రి జీవితులను



తరింపచేస్తుంది. గంగా స్నానంతో పాపాలు కడివేయబడతాయి. గాయత్రితో పాపవృత్తులు నిర్మూలించ బడతాయి. గాయత్రి ఉపాసనకు గంగవొడ్డు అధిక ప్రభావశాలిగా చెప్పబడింది. రెండింటి యొక్క సమన్వయం గంగాయమునల సంగమం వలె అధిక ప్రభావశాలిగా చెప్పబడింది. సప్తఋషులు గాయత్రి సాధనద్వారా పరమ సిద్ధికి గంగాతటమే ఉపయుక్తముగా గుర్తించి దీర్ఘకాలం తపస్సు చేశారు. గాయత్రిమాత ఒక చేతిలో నీరు నిండిన కమండలం ఉన్నది. ఆ అమృత జలము గంగాజలమే. ఉచ్ఛస్తర గాయత్రి సాధన చేసేవారు తరచు గంగాస్నానము, గంగా జలపానము, గంగ ఒడ్డు వంటి సుయోగ్యమైన వానిని కోరుకొంటారు.

భక్తి గాథలలో రైదాసు సమర్పణను గంగ స్వయంగా స్వీకరించిన కథ వస్తుంది. అనసూయాదేవి చిత్రకూట సమీపంలో తపస్సు చేసి మందాకినిని పృథ్వీపై అవతరింపచేసింది. గాయత్రి ఉపాసనతో సాధకుని అంతఃకరణ గంగోత్రి-గోముఖం వలె అవుతుంది, వారిలో ప్రజ్ఞ యొక్క నిరరరిణి ప్రవహించుట మొదలవుతుంది.

గాయత్రి అనేక ధారలలో మందాకిని ఒకటి. పాపాలకు ప్రాయశ్చితంగా, పవిత్రతా పెంపుదలకు మందాకినిని అవగాహన చేసుకోవాలి.

# 9. ఋతంభరా

గాయత్రి యొక్క ఒకశక్తిధార ఋతంభరా. దీనినే ప్రజ్ఞ అని అంటారు. ఏ "ధీ" తత్వము యొక్క ప్రేరణ కొరకు సవితా దేవతను ప్రార్థించామో అది ఋతంభర ప్రజ్ఞయే. దీని స్వరూపం అర్థమయ్యేందుకు, లభించే ఉపాయము చెప్పుటకు సువిస్తృత బ్రహ్మ విజ్ఞాన సంరచన జరిగింది. బ్రహ్మ విద్యా తత్వదర్శనం ద్వారా ఈ ఋతంభర ప్రజ్ఞ వికసిస్తుంది. దీనికంటే అధిక పవిత్రమైనది, ఈ ప్రపంచములో లేదు, దానినే సద్‌జ్ఞానమని భగవాన్ శ్రీకృష్ణుడు తెలియజేశాడు. దీని ఉపలబ్ధి జ్ఞానచక్షువు తెఅచుకొనుట అని చెప్పారు. ఆ దివ్యనేత్రము ద్వారానే ఆత్మదర్శనము, తత్వదర్శనము యొక్క లాభం కలుగుతుంది. ఏ ఆత్మ సాక్షాత్కారము, బ్రహ్మ సాక్షాత్కారము కొరకు తత్వదర్శులు ప్రయత్నశీలురై ఉంటారో, ఆ ఉపలబ్ధి ఋతంభరా ప్రజ్ఞ యొక్క అనుగ్రహము వలననే సంభవం.

బుద్ధి చాతుర్యము వలన సంపత్తి ప్రోగుచేసుకొనుట, లోకంలో ఆకర్షణ వంటి లాభాలు సంభవమే, కానీ ఆత్మిక లాభాల కొరకు సద్భావన సహృదయత, సజ్జనత వంటి భావ సంవేదనలు కావాలి. వీనిని తగురీతిలో వివేకముతో సమన్వయపరచుకొనుట ద్వారా ఆయా సాధకులు తమ ఋతంభరా ప్రజ్ఞను చాటుకొనెదరు. ఇది ఎవరికి ఏ మోతాదులో లభిస్తుందో అదే నిష్పత్తిలో సంత్, సజ్జనుడు, ఋషి, మహర్షి, రాజర్షి, దేవర్షి, అవుతూ పోతారు. లౌకిక బుద్ధి వలన సామాజిక సంపదలు లభిస్తాయి. ఆత్మిక విభూతులు ఉత్పాదన, అభివర్ధన తత్వదృష్టి వలననే సంభవం. ఈ తత్వదృష్టినే ఋతంభరా ప్రజ్ఞ అని అంటారు. జీవితాన్ని గౌరవంతో కూడినదిగా చేయుట, పూర్ణత్వమనే లక్ష్యమును అందుకొనుట మొత్తం భూమిక ఋతంభరా ప్రజ్ఞ సంపాదించుట వలననే ఏర్పడుతుంది.

ఈశ్వరుని అన్నింటికంటే గొప్ప వరదానము ఋతంభరా ప్రజ్ఞయే, అది ఉదయిస్తే మాయ యొక్క సమస్త బంధనాలు తెగిపోతాయి. అజ్ఞానాంధకారమును అంతము చేయుటకు ఏ అరుణోదయాన్ని కోరుకుంటామో అది సవిత యొక్క ప్రకాశములో ఋతంభరా ప్రజ్ఞారూపంలో ప్రభాతకాల ఉషస్సు వేళ తన పరిచయం చేసుకొంటుంది. ప్రజ్ఞావతరణతో మనుష్యుని ఆకాంక్షలు,



ఆలోచనలు, గతి విధులు మాయాబద్ధులైన మనుష్యుల కంటే భిన్నంగా (ఎల్లప్పుడూ) ఉంటాయి. వారు వాసన, తృష్ణ యొక్క బురదలో మునిగిపోకుండా తమ నీతి యొక్క ఉత్కృష్ణ చింతన, ఆదర్శ కర్తృత్వముతో జోడించబడుతారు. ప్రజలు ఏమంటున్నారు, ఏమి చేస్తున్నారు అనే దానితో వారు కొంచెం కూడా ప్రభావితం కారు. లోభమోహములనే మదిరాపానము చేసి ఉన్మత్తులై పథభ్రష్టులైన వారిపట్ల వారికి కరుణ కలుగుతుంది, వారిని ఉద్ధరించుటకు నిర్ణయాలు చేస్తారు. నిజాయితీ, సత్యము కాక మరే పరామర్శ వారిని ప్రభావితము చేయలేదు. ప్రజ్ఞయొక్క ఇంత సుదృఢమైన కవచము ధరించేవారు జీవిత సంగ్రామంలో విజయం పొందుతారు, భూమి మీద దేవతలుగా పిలువబడుతారు.

దృష్టికోణంలో ఉత్కృష్ణత నిండుట వలన పదార్థాలలోని ఉపయోగము ప్రాణులలోని సదాశయత దర్శనమవుతుంది. తదనురూపంగా తమ వ్యవహారము మార్చుకొనుట, నిష్కర్షకు రాగల్గుట మొదలవుతుంది. చింతన యొక్క ఈ ప్రక్రియ పేరే స్వర్గము. వాసన, తృష్ణ, అహంకారములను తొలగించి నిష్ఠ, ప్రజ్ఞ, శ్రద్ధలతో కూడిన మనోభూమి ఏర్పడినచో తుష్ఠి, తృప్తి, శాంతికి లోటుండదు. అప్పుడు ప్రలోభాల నుండి విముక్తి, ఆదర్శాల పరిపాలన – ఇదియే జీవన్ముక్తి. ఈ స్థితికి చేరుకొన్న వారికి ఆత్మ సాక్షాత్కారము, బ్రహ్మ సాక్షాత్కారము యొక్క సచ్చిదానందము లభిస్తుంది.

గాయత్రి ఉపాసనతో ఋతంభరా ప్రజ్ఞా ప్రాప్తిస్తుంది. లేదా ఇలా చెప్పుకోవచ్చు. ఋతంభరా ప్రజ్ఞ అనుభూతిని పొందిన వారే గాయత్రీ సాక్షాత్కారము పొందెదరు. వివాదంలోకి వెళ్ళకుండా ఈ రెండూ అన్యోన్యాశ్రితం అని గ్రహించుదాము. ఒకటి ఉన్నచోట మరొకటి తప్పనిసరిగా ఉంటుంది. గాయత్రి యొక్క నిజమైన అనుగ్రహము ఎవరిపై ప్రసరిస్తుందో వారిలో ఋతంభరా ప్రజ్ఞ, బ్రహ్మ తేజస్సు యొక్క ప్రకాశము ప్రత్యక్షంగా మిరుమిట్లు గొలుపుతుంది. సామాన్యులతో పోల్చినపుడు అతడు ఉత్కృష్ఠతా దృష్టిలో ఉన్నతుడుగా పురోగామిగా దృష్టిగోచరమవుతాడు.

# 10. అజపా

గాయత్రి సాధనలో ఒక స్థితి ఎలాంటిదంటే, దానిలో ఆత్మ పరమాత్మల మధ్య ఇచ్చిపుచ్చుకొనే ప్రక్రియ స్వయంగా జరుగుతుంది. ఈ దివ్య కలయికతో ఫలస్వరూపంగా లభించే ఉపలబ్ధుల యొక్క లాభము లభించుట మొదలవుతుంది, ఆ స్థితిని "అజపా" అంటారు.

అజపా గాయత్రి యొక్క సాధనాత్మక స్వరూపం "సోహం సాధన". దీనిని హంస యోగమని అంటారు. గాయత్రి యొక్క వాహనం హంస. ఈ హంస సోహం సాధన ద్వారా సాధించబడే హంసయోగమే. గాయత్రి యొక్క శబ్దార్థము – ప్రాణములను కాపాడునది. 'గయ' అనగా ప్రాణములు 'త్రీ' అనగా రక్షించునది. ప్రాణతత్వము యొక్క విశిష్ఠ అవతరణ ప్రాణాయామం ద్వారా జరుగుతుంది. గాయత్రీ సాధనలో 24 ప్రాణాయామాల విధానమున్నది. వీటన్నిటిలో సోహం సాధనకు ప్రాధాన్యత లభించినది. ఇది అత్యంత ఉన్నతస్థాయి రక్త సంచారం చేయించే ప్రాణాయామం. సామాన్య ప్రాణాయామములలో ఇచ్ఛాశక్తి మరియు శారీరక గతి విధులను ఉపయోగిస్తాము. సోహం సాధనలో ఈ పని అంతా ఆత్మ స్వయంగా చేస్తుంది. శరీరం మనస్సు యొక్క సహకారము అవసరమే కలుగదు.

శ్వాస శరీరంలో ప్రవేశించేటప్పుడు "సో" యొక్క సూక్ష్మధ్వని అవుతుంది. శ్వాస బయటకు వెలువరించేటప్పుడు "హం" యొక్క శబ్దానుభూతి కలుగుతుంది. ఈ ధ్వనులు అత్యంత సూక్ష్మము. స్థూల కర్ణేంద్రియములు వాటిని వినలేవు. శబ్దం యొక్క తన్మాత్రను చేరుకోగలిగిన ధ్యానధారణలోనే వాటి అనుభూతి కల్గుతుంది. శాంతచిత్తంగా ఏకాగ్రంగా శ్వాసను లోనికి తీసుకునే సమయంలో "సో" ని బయటకు వెలువరించే సమయంలో "హం" శబ్ద ప్రవాహాన్ని ధారణ చేసినట్లైతే కొంత కాలం తర్వాత ఈ దివ్యధ్వని అనాయాసంగానే అనుభవంలోనికి రావటం ప్రారంభమవుతుంది. కృష్ణుని వేణునాదం వినుటవలన ఏ ఆనందం గోపికలకు లభించేదో అటువంటి దివ్య అనుభూతి ఇంద్రియాలకు, ఉపత్థికలకు ఈ సోహం ధ్వని ప్రవాహం వినుట వలన కలుగుతుంది. శాస్త్రాలలో శబ్ద బ్రహ్మ–నాద బ్రహ్మ



గురించి వ్రాయబడి ఉన్నది. స్థూల వివేచన చేస్తే సత్సంగ ప్రవచనమును "శబ్ద" మని, భక్తి నిండిన సంగీతాన్ని నాదబ్రహ్మమని అంటారు. కానీ దివ్య భూమికలో ఈ రెండు శబ్దాలు "సోహం" సాధనకు ప్రయుక్తమవుతాయి. తపస్వులు దీనిని "అనాహతధ్వని" అంటారు.

గాయత్రి యొక్క మూల జన్మస్థానము ఓంకారము. దాని విస్తారము గాయత్రి యొక్క 24 అక్షరములుగా అయినది. ఈవిధంగా నాదబ్రహ్మము యొక్క బీజము "సోహం" యే. దాని విస్తరణ "నాదయోగ" సాధనలో సూక్ష్మ కర్మేంద్రియాల ద్వారా గంట, మేఘగర్జన, వేణువు, మృదంగము, కలరవము మొదలైన అనేకానేక ధ్వనుల ద్వారా అనుభవమవుతుంది. ఈ దివ్య ధ్వనులు ప్రకృతి యొక్క సూక్ష్మ అంతరాళంలో పైకిలేస్తాయి, వాటిని వినే సామర్థ్యం ఉత్పన్నమగుటవలన వాటి వెనుక దాగిన రహస్యాలు అవగతమయి తద్వారా విశ్వము యొక్క అవగతం కాని గతి విధులు కూడా తెలియబడి సాధకుని సూక్ష్మదర్శిగా చేస్తాయి.

సామాన్య సాధనలు శరీరము, మనస్సు సహాయంతో ప్రయత్న పూర్వకంగా చేయవలసి ఉంటుంది. కానీ అజపా గాయత్రి వలన ఆత్మతో నేరుగా సంబంధము కలుగుట వలన సాధనా క్రమము స్వయంచాలితం అవుతుంది, తన ఇరుసుపై స్వయంగా తిరుగుతూ ఉంటుంది. సోహం ధ్యాన అభ్యాసాన్ని అజపా సాధన అంటారు. దానికి ఆత్మతో నేరుగా సంబంధం ఏర్పడి గతి చక్రము స్వయంగా తిరిగే స్థితిలో అదే ఒక శక్తిగా మారుతుంది. ఈ శక్తి వలన సాధకుడు ఆత్మజ్ఞానము, బ్రహ్మజ్ఞానము ప్రాప్తించుకుంటాడు. ఆత్మకల్యాణము, విశ్వకల్యాణము కొరకు మహత్వపూర్ణ సామర్థ్యాలు సంపాదించుకొనుటలో కూడా ఇది ఉపయోగపడుతుంది.

అజపాలోని సన్నిహిత హంసయోగాన్ని దృష్టిలో ఉంచుకొని గాయత్రి యొక్క వాహనం హంస అని చెప్పబడింది. ఎవరు దీనిని సాధన చేస్తారో వారి అంతరంగం నీర–క్షీర వివేక సామర్థ్యం కలిగిన దివ్యదర్శి అవుతుంది. వారి బహిరంగం కీటకాలు తినని, ముత్యములను తినే ఆదర్శవాది అవుతుంది. చింతనలో ఉత్కృష్టత, కర్తృత్వంలో ఆదర్శవాదం కలిగిన వారిని రాజహంసలంటారు. మరింత ఉన్నతులైతే పరమహంసలవుతారు. ఈ ఉన్నత స్థాయి భూమిక చేరుకొనుటలో గాయత్రి యొక్క అజపాశక్తి యొక్క అనుగ్రహం అసాధారణం.

# 11. బుద్ధి

గాయత్రి మహాశక్తి యొక్క శ్రేష్ఠత, మహత్తు మరియు ప్రతిక్రియ ఏమై ఉన్నది. దీనికి సమాధానం విభిన్న దేవతల స్వరూపము, వాహనము, ఆయుధము స్వభావము మొదలైన వాటిపై దృష్టి సారించుట వలన లభిస్తుంది. దేవతలు, దేవీలు గాయత్రి మహాశక్తి యొక్క విశిష్ఠ ప్రవాహాలుగా గ్రహించవచ్చు.

గాయత్రి యొక్క 24 మంది దేవతలలో గణేశుడు ఒకటి. గణేశుడనగా వివేకము, బుద్ధి యొక్క దేవత. ఎక్కడ దూరదర్శిత్వముతో కూడిన వివేకము యొక్క బాహుళ్యము కనబడితే అక్కడ గణేశుని ఉపస్థితి, అనుగ్రహము ప్రత్యక్షమని భావించవచ్చు. సదానమే గణేశుడు. గాయత్రి మంత్రము యొక్క మూలధారణ సదానమే. అందువలన మరొకవిధంగా గణేశుని గాయత్రి యొక్క ప్రముఖ శక్తి ధారగా చెప్పవచ్చు.

గణేశుని ఒక చేతిలో అంకుశం, రెండవ చేతిలో మోదకము. అంకుశము అనగా అనుశాసనము, మోదకము అనగా సుఖ సాధనము. ఎవరు అనుశాసనము సాధించారో వారు అభీష్ఠ సాధనాలు కూడా సమకూర్చుకుంటారు. గణేశునికి సంబంధించిన ఈ రెండు ఉపకరణాలకు సంకేతం ఇదే.

గణేశునికి ఇద్దరు నెచ్చెలులు, సహచరులు ఉన్నారు. ఒకరి పేరు బుద్ధి, రెండవవారి పేరు సిద్ధి. బుద్ధి అనగా ఆత్మిక సంపదలు; సిద్ధి అనగా భౌతిక సఫలతలు. వివేకము యొక్క ఈ రెండు ఉపలబ్ధులు సహజము, స్వాభావికము. బ్రహ్మతోపాటు ఏవిధంగా గాయత్రిని, సావిత్రిని ఇద్దరు సహచరులుగా అంగీకరించారో అదేవిధంగా గణేశునితో పాటు బుద్ధి, సిద్ధి, బుద్ధి ఆత్మ బలమైతే సిద్ధి సమృద్ధి బలము. పరబ్రహ్మ యొక్క ఇద్దరు సహచరులు పరా, అపరా. ప్రకృతి, వాటి సహాయంతో జడ-చేతనల విశ్వం యొక్క గతిచక్రం తిరుగుతూ ఉంటుంది. వివేక రూపీ గణేశుని స్వరూప నిర్మాణం చేసే సమయంలో తత్వదర్శులు వారికి ఇద్దరు నెచ్చెలులను కూడా చిత్రించారు. ఆత్మ బలము, భౌతిక సఫలతల క్షేత్రమంతా వివేకం మీద ఆధారపడి ఉంది. ఈ తథ్యాన్ని గణేశుడు, ఆయన సహచరుల-రూపంలో (బుద్ధి, సిద్ధి) ప్రస్తుతి చేశారు.

బుద్ధి, సిద్ధి అనగా ఆత్మజ్ఞానము-ఆత్మబలము, ఆత్మసంతోషము, అంతరంగ ఉల్లాసము, ఆత్మవిస్తారము, సమృద్ధి, విద్య, సమర్థత, సహకార సంపాదన, మరియు వైభవము. దాదాపు ఇవే విశేషతలు గాయత్రీ, సావిత్రిలో ఉన్నాయి. ఎక్కడ బుద్ధి ఉన్నదో అక్కడ సిద్ధి కూడా ఉంటుంది. ఇద్దరూ గణేశునికి వింజామరలు విసురుతూ ఉంటారు.

వివేకవంతులు ఆత్మిక, భౌతిక రెండు విధాలుగా సుసంపన్నులై ఉంటారు. సంక్షిప్తంగా గణేశునితోపాటు అవిచ్ఛన్న రూపంలో జోడించబడిన బుద్ధి-సిద్ధిల చిత్రణ తాత్పర్యమిదే.



# 12. సిద్ధి

బుద్ధి అనగా ఆత్మిక ఉత్కృష్టత, సిద్ధి అనగా భౌతిక సమర్థత. మర్యాదల అంకుశం అంగీకరించేవారు సంయమం సాధన చేసేవారు, ఏ దృష్టితోనైనా సమర్థులవుతారు. వారికి సుఖసాధనల, సౌకర్యాలు, సంపన్నతకు లోటు ఉండదు. ఉత్కృష్ట వ్యక్తిత్వ సంపన్నుడైన వ్యక్తి ఎల్లప్పుడూ సంతోషంగా ఉంటాడు. ప్రసన్నత పంచుతూ, విరజిమ్ముతూ కన్పిస్తారు. ఇదే మోదకమంటే. ప్రతి క్షణమూ సంతోషము, ఆనందము యొక్క రసాస్వాదన లభిస్తుంది. వివేకవంతుని అయస్కాంత వ్యక్తిత్వము దృశ్య మరియు అదృశ్య జగత్తు నుండి అతని ప్రగతి మరియు ప్రసన్నతకు అవసరమైన అన్ని ఉపలబ్ధులు ఆకర్షించుకుంటుంది.

బుద్ధి-సిద్ధుల గుఱించి ఒక భ్రాంతి ఉన్నది; ఇవేవో గారడీవాడు చమత్కారము చూపించుటలో పనికి వచ్చే విశేషతల వంటివని. ఆకాశములో ఎగురుట, నీటిమీద నడచుట, అదృశ్యమగుట, ఆకారము మార్చుకొనుట. ఎక్కడి నుండో వస్తువులను రప్పించుట, మాయము చేయుట, భవిష్యత్తు చెప్పుట వంటి ఆశ్చర్య జనక విషయాలను సిద్ధులంటారు. ఇది గారడీవాని ఆట వంటిది, చేతి నైపుణ్యము, హిప్నాటిజం వంటి తాంత్రిక ప్రయోగాల ద్వారా కూడా చేయవచ్చును. వీటిని ప్రదర్శించుటలో ఉద్దేశ్యము, లోకులను ఆశ్చర్య చకితులను చేసి తమ గుప్పిటిలో పెట్టుకొనుట మరియు అనుచిత లాభము పొందుట కావచ్చును. ఇందువలన అటువంటి ప్రదర్శనల సాధన శాస్త్రములలో అడుగడుగున నిషేధించారు. వానిలో విశేషతలున్నప్పటికీ వాటిని ప్రదర్శించుట అడ్డగించారు. ఎవరు హస్తలాఘవము చమత్కారము చూపిస్తారో, దానిని ఆధ్యాత్మిక సామర్థ్యముతో జోడిస్తారో వారిని అన్ని విధాలా నిందనీయులని చెప్పవచ్చును.

వాస్తవిక బుద్ధి ఏమంటే సాధకులు తమ ఉత్కృష్ట వ్యక్తిత్వ సహకారముతో ఆత్మసంతోషము, ప్రజల శ్రద్ధ మరియు దైవీ అనుకంప యొక్క వివిధ లాభాలను పొంది మనుష్యుల మధ్య దేవతల మాదిరి జీవిస్తారు. తమ ఆదర్శవాద సాహసముతో వ్యక్తి వ్యక్తిని ప్రభావితం చేస్తారు. వాస్తవిక సిద్ధి ఏమంటే తమ ఉపార్జన పర్వతమంత పెద్దదైనా తాము మాత్రము సగటు నాగరికులవంటి జీవితాన్ని జీవిస్తూ మిగిలిన దానిని సత్ప్రయోజనాల కోసం ఉదార పూర్వకంగా సమర్పించుకుంటారు. అటువంటి అనుకరణీయ, ఆదర్శాన్ని నిలబెట్టి చూయించుటయే ఉన్నతస్థాయి చమత్కారము. ఈ మార్గంలో ఎవరు ఎంతముందుకు వెళ్ళగలిగితే వారిని అంత పెద్ద సిద్ధపురుషులని చెప్పవచ్చు.

గాయత్రికి ఒకపేరు బుద్ధి. రెండవది సిద్ధి. ప్రయత్నపూర్వకంగా సత్ప్రవృత్తులను అనుసరించేవారు. ఈ రెండింటి ఉపలబ్ధులను పొంది ప్రతి దృష్టి నుండీ ధన్యులవుతారు. నిజమైన గాయత్రి ఉపాసన ప్రతిఫలం బుద్ధులు సిద్ధుల రూపంతో ఎదురౌతుంది. గాయత్రి ప్రత్యక్ష సిద్ధియే; ఎవరి అంతరాళంలో అది అవతరిస్తుందో వారికి బుద్ధి, సిద్ధుల విభూతుల, సమృద్ధులతో సఫల జీవనం లభిస్తుంది.

# గాయత్రీ 24 శక్తిధారలు

24 అక్షరాల సర్వసమర్థ గాయత్రికి 24 పేర్లు కూడా ఉన్నాయి. వాటిలో సౌర రూపంలో గాయత్రీ వైభవ విస్తరణ దర్శించగలము. వీటిలో 12 వైదిక వర్గము, 12 తాంత్రిక వర్గము. గాయత్రీలోని 24 అక్షరాలలో 24 దేవశక్తులు నివాసముంటాయి. వాటిననుసరించి పూజించబడతాయి.

1. ఆదిశక్తి, 2. బ్రాహ్మి, 3. వైష్ణవి, 4. శాంభవి, 5. వేదమాత, 6. దేవమాత, 7. విశ్వమాత, 8. ఋతంభర, 9. మందాకిని, 10. అజపా, 11. బుద్ధి, 12. సిద్ధి ఇవి వైదిక వర్గము.

1. సావిత్రి, 2. సరస్వతి, 3. లక్ష్మి, 4. దుర్గా, 5. కుండలిని, 6. ప్రాణాగ్ని, 7. భవాని, 8. భువనేశ్వరి, 9. అన్నపూర్ణ, 10. మహామాయ, 11. పయస్విని, 12. త్రిపురా ఇవి తాంత్రికము.

12 జ్ఞానపక్షము 12 విజ్ఞాన పక్షము కలిపి 24 అక్షరాల గాయత్రి మంత్రం నిర్మితమైనది.

గాయత్రి బ్రహ్మచేతన సమస్త బ్రహ్మాండము యొక్క అంతరాళమంతా సంవ్యాప్తమై ఉన్నది. జడజగత్తు యొక్క సమస్త నిర్వహణ దాని ప్రేరణ, వ్యవస్థ దీని ద్వారానే జరుగుతున్నది.

**గాయత్రీ బహునామాస్తి సంయుక్తా దేవ శక్తిభిః ।**
**సర్వసిద్ధిషు వ్యాప్తా సా ఇష్టా మునిభిరాహతా ॥**



**తత-పరా పరాశక్తి పరమా త్వమ్ హి గీయసే ।**
**ఇచ్ఛాశక్తిః క్రియాశక్తిర్జ్ఞానశక్తి స్త్రి శక్తిదా ॥**

నీవే పరా, పరమశక్తి అని పిలువబడుచున్నావు. ఇచ్ఛా జ్ఞాన క్రియా శక్తులన్నీ నీవే.

గాయత్రి సహస్ర నామములలో కొన్ని ముఖ్యమైన నామములు.

గాయత్రికి అసంఖ్యాక నామములున్నవి. సమస్తదేవ శక్తులు ఆమెలో అనుప్రాణితమై ఉన్నవి. సమస్త సిద్ధులలో ఆమె దర్శనమే అవుతుంది.

1. అచింత్య లక్షణా 2. అవ్యక్తా 3. అమృతార్ణవ మధ్యస్థలా 4. అజితా 5. అపరాజిత 6. అణిమాది గుణాధారా 7. అర్కమండల సంస్థితా 8. అజరా 9. అజా 10. అకారాదిజకారన్తా 11. అరిషడ్వర్గభేదినీ 12. అసురఘ్ని 13. అలక్ష్మీఘ్ని 14. ఆదిలక్ష్మి 15. ఆదిశక్తి 16. ఆదిత్య పరసేవితా 17. ఆచార్య వర్తనాచారా 18. ఆగ్నేయి 19. ఆసనస్థితా 20. అంతరధ్వాన్తి నాశిని 21. ఇష్టదా 22. ఇందురూపిణీ 23. ఇష్టసంధాన కరణీ 24. ఇడాపింగళారూపిణే 25. ఈశ్వరీదేవి 26. ఉషా 27. ఉద్ద ప్రభా 28. ఊర్ధ్వకేశీ 29. ఊర్ధ్వాధోగతి భేదినీ 30. ఋషిదేవ నమస్కృతా 31. ఋణ హర్త్రీ 32. ఋజు మార్గస్థా 33. ఐహికా ముష్మికప్రదా 34. ఓతప్రోత నివాసినీ 35. ఔపసన ఫలప్రదా 36. నీలకంఠినీ 37. కల్యాణీ 38. కాలరూపిణీ 39. కామచార ప్రభంజనీ 40. కౌశికీ 41. కాంతి 42. కౌమారీ 43. కుండనిలయా 44. కమండలు ధారా 45. కర్మనిర్మూల కారిణీ 46. కామదుధా 47. ఖడ్గ 48. ఖేట్కరీ 49. ఖేచరీ 50. ఖలఘ్ని 51. గంగా 52. గోమయీ 53. గీతా 54. గుణత్రియ విభావితా 55. గుణవతీ 56. గుర్వీ 57. గుహ్యా 58. గర్వాపహారిణీ 59. ఘోషా 60. చతుర్భుజీ 61. చాతురీ 62. చరిత్రప్రదా.

# 13. సావిత్రి

ఆదిశక్తి యొక్క రెండు ధారలు 1. ఆత్మ సంబంధమైనది 2. భౌతిక సంబంధమైనది. ఆత్మికమైనది గాయత్రి, భౌతికమైనది సావిత్రి అని అంటారు. గాయత్రి ఏకముఖి. దాన్ని ఏకాత్మవాదము అద్వైతవాదము, ఆత్మవాదము అని అనవచ్చు. సావిత్రి పంచముఖి. శరీరం పంచ తత్వములతో తయారయినది. పంచ తన్మాత్రల సహాయంతో శబ్ద రూపరస గంధ చైతన్యం యొక్క స్పందన పంచ ప్రాణముల వలన ఉంటుంది. పంచతత్వాలు పంచప్రాణముల వలన ఉంటాయి. పంచతత్వాలు పంచ ప్రాణాలు కలిసి ఏ జీవసత్తాను నడిపిస్తాయో దాని అధిష్ఠాత్రి సావిత్రి. ఐదు జ్ఞానేంద్రియాలు మరియు కర్మేంద్రియాలు ఈ జీవనచర్యా చక్రాన్ని ముందుకు లాక్కువెళ్ళుతాయి.

సూక్ష్మ శరీరం యొక్క పూర్తి ఆకారం పంచకోశముల ఆధారంగా తయారైనది. వైజ్ఞానిక భాషలో వాటిని ఫిజికల్ బాడీ, యాస్ట్రల్ బాడీ, మెంటల్ బాడీ, కాజల్ బాడీ అంటారు. ఆధ్యాత్మిక భాషలో వాటిని అన్నమయ్యకోశం, ప్రాణమయకోశం, మనోమయకోశం, విజ్ఞానమయకోశం, ఆనందమయకోశం అంటారు. ఇవి సిద్ధుల, విభూతుల భాండాగారములు. కాయకళేబరంలో విద్యామానమై ఉండే వీటిని దేవతలని పిలచెదరు. ఈ ఐదు బహుమూల్య ఖజానాలు కాయ-సత్తా అంతరాళంలో విద్యామానమై ఉన్నాయి. ఇవి ఎప్పటివరకు నిద్రాణమై ఉంటాయో అంతవరకు మనిషి దీనుడు, దుర్బలుడుగా ఉంటాడు. ఎప్పుడు అవి జాగృతమవుతాయో పంచదేవతలు వివిధ విధాలుగా సహాయం



చేస్తాయి. దక్షిణ మార్గ సాధనలో గాయత్రిని వామమార్గ సాధనలో సావిత్రిని ప్రముఖంగా భావిస్తారు. సకామ సాధనలు సావిత్రికి చెందినవి. ఆ ప్రయోజనాలకనుగుణంగా బీజ మంత్రములు కలిపి సాధన చెయ్యాలి. గాయత్రి సాధన ఆత్మోన్నతి కొరకు చెయ్యాలి. దానిలో స్థూల, సూక్ష్మ, కారణ శరీరాల సమున్నతిని కలిగించే భూః, భువః, స్వః అను బీజమంత్రములు జోడించబడి ఉన్నవి. బ్రహ్మవర్చస్సు కొరకు చేసే సాధనలో ఈ మూడింటి సంతులిత సమన్వయమున్నది.

పంచముఖి సావిత్రి యొక్క జ్ఞానపక్షములో, జీవితంలోని విభిన్న క్షేత్రాలలో ప్రయుక్తమయ్యే పంచశీల పరిపాలన యొక్క సంకేతమున్నది. సామాన్య జీవితంతో శ్రమశీలత, మితవ్యయము, పరాక్రమం, సహకారము, సజ్జనత్వములను పంచశీల అంటారు. విభిన్న వర్గాలకు, విభిన్న ప్రయోజనాలకు పంచశీల వేరువేరుగా ఉండి, వాటి పరిపాలనతో అభీష్టక్షేత్రాలలో స్థూల అనుకూలతలు సహజంగానే సిద్ధిస్తూ ఉంటాయి. పంచశీలయే పంచదేవతలు.

గాయత్రి యొక్క అసంఖ్యాక దివ్యధారలలో అన్నింటి కంటే సమీపవర్తి, అధిక సమర్థమైనది సావిత్రి. రెండూ ఎంత దగ్గర అంటే రెండింటిని దాదాపు ఒకటిగానే అనుకుంటూ ఉంటారు. వస్తుతః సావిత్రి భౌతిక శరీర సంబంధమైనది. గాయత్రి ఆత్మ సంబంధమైనదిగా భావించాలి, ఆవశ్యతానుసారము, అభీష్ఠ సిద్ధర్యాల కొరకు ఆమె కొంగు పట్టుకోవాలి.

# 14. సరస్వతి

జ్ఞాన చేతన యొక్క రెండు ధారలలో ఒకటైన ప్రజ్ఞ. ఆత్మోన్నతి మార్గాన్ని సుగమం చేస్తుంది. బుద్ధి సమాజ అవసరాలు మరియు నిర్వహణలో వచ్చే సమస్యల సమాధానం కోసం ఉపయోగించబడుతుంది. బుద్ధి స్వరూపము మస్తిష్కము మరియు ప్రజ్ఞ స్వరూపము అంతఃకరణము. ప్రజ్ఞ యొక్క అధిదేవత గాయత్రి మరియు బుద్ధిని వికసింప చేసేది సరస్వతి. అవసరాన్ని బట్టి రెండింటిలో దేని ఆశ్రయం పొందుతామో దాని ప్రతిఫలం మనకు లభిస్తుంది.

సరస్వతిని సాహిత్యం, సంగీతం, కళల దేవతగా భావిస్తారు. ఆమెలో చింతన, భావన మరియు సంవేదనల యొక్క త్రివిధ రూపం సమన్వయమై ఉన్నది. వీణ-సంవేదన, పుస్తకము-చింతన మరియు నెమలి వాహనం కళలకు ప్రాతినిధ్యంగా ఉంటాయి. సరస్వతీ దేవిని విద్యాదేవతగా భావించి పూజ చేయుట జరుగుతుంది. విద్యా సంస్థలలో వసంత పంచమి నాడు సరస్వతీ జయంతి అత్యంత ఉల్లాసంగా జరుపుకొంటారు. పశు ప్రవృత్తి గల వారిని మనిషిగాను, అంధునికి దృష్టిని ప్రదానం చేసే గొప్ప గౌరవం విద్యకు లభించింది. ఆలోచనతోనే మనుష్యుడు తయారవుతాడు. బుద్ధిని ప్రేరేపించేది మనస్సు, భౌతికంగా పొందిన ప్రగతి యొక్క శ్రేయస్సు బుద్ధి బలానికి చెందుతుంది మరియు ఇది సరస్వతి యొక్క అనుగ్రహం అనుకోవడం ఎంతో సముచితం. ఇటువంటి ఉపలబ్ధి పొందనట్లయితే మానవుడు నరవానరుని వలే అడవి మనిషిలాగా జీవితాన్ని గడపవలసి ఉంటుంది. విద్యా ప్రాధాన్యత, బౌద్ధిక వికాసం యొక్క అవసరం ప్రతి మనిషికి తెలియజేయడానికి సరస్వతీ పూజ యొక్క పరంపర మొదలయినది. దీనినే వేరొక విధంగా గాయత్రి మహాశక్తి యొక్క అంతర్గత బుద్ధి పక్షాన్ని ఆరాధించుట అని చెప్పవచ్చు.

మహాకవి కాళిదాసు, వరదాచార్యులు, వోపదేవ్ మొదలయినవారు వారు మంద బుద్ధులు. వీరు సరస్వతి ఉపాసన గావించి మహా పండితులయ్యారు. దీని యొక్క సామాన్యమైన అర్థం వీరు ఎంతో మనోయోగం మరియు ఉత్సాహంతో అధ్యయనంలో ఆసక్తితో



నిమగ్నులయినారు. వారు అనుత్సాహ మనఃస్థితిలో పడియున్న తమ మస్తిష్క సామర్థ్యమును వికసింపచేసికొనుటలో సఫలీకృతులైనారు. ఏదో కారణవశాన దుర్బలస్థితిలో పడియున్న బుద్ధి కుశలతను నిద్ర లేపి యోగ్యత కలిగేటట్లుగా ఉపాయాలు. ప్రయత్నాలు చేయవలయును. దీనినే సరస్వతీ ఆరాధన అంటారు. ఉపాసన అనేది భావ విజ్ఞానం యొక్క మహత్వపూర్ణమైన అంశము. శ్రద్ధ మరియు తన్మయత్వంతో శాస్త్రము అధ్యయనము చేసే శాస్త్రజ్ఞులు చెప్పేదేమిటంటే వ్యాయామము, అధ్యయనము, కళ, అభ్యాసం సాధన కూడా సమర్ధవంతమైన ప్రక్రియలే. ఇది అధిచేతనా క్షేత్రంలో ఉండే అనేక రహస్యమయ సామర్థ్యాలను పైకి తేవడానికి మరియు వృద్ధి చేయడానికి పూర్తిగా సమర్ధవంతమైనది. సరస్వతీ ఉపాసన కూడా ఇదే విషయాన్ని తెలియజేస్తుంది. దీనిని శాస్త్రీయ విధిగా నిర్వహించినట్లయితే అది ఇతర మానసిక సాధనల కన్నా భౌతికమైన శక్తి సామర్థ్యాలను పెంపొందింప చేయడంలో చాలా ఎక్కువగా సఫలీకృతమవుతుంది. మందబుద్ధులుగా ఉండేవారికి గాయత్రీ మహాశక్తి యొక్క సరస్వతీ తత్వం అధికహితకరమయినది. భౌతిక సామర్థ్యాన్ని వికసింప చేయుటలో మనస్సులో ఉండే చంచలతను మరియు అవ్యవస్థను దూరం చేయుటకు సరస్వతీ సాధన ఎంతో ఉపయోగకారి. మస్తిష్క మంత్రమునకు సంబంధించిన నిద్రలేమి, తలనొప్పి, ఉద్రేకం, జలుబులాంటి రోగాలలో గాయత్రి యొక్క అంశమైన సరస్వతీ సాధన వలన లాభం కలుగుతుంది. కల్పనా శక్తి లేకపోవుట, సమయంలో ఉచిత నిర్ణయం తీసుకొనలేక పోవటం, మతిమరుపు, అరుచి కారణాల వలన మనుష్యుడు మానసిక దృష్టిలో వికలాంగుడు, అసమర్థుడులాగా తయారవుతాడు మరియు మూర్ఖుడు అని పిలువబడతాడు. దీన్ని దూరం చేయడానికి సరస్వతీ సాధన అవసరం.

విద్య అంటే ప్రతి వ్యక్తి మనస్సులో అధికమైన ఉత్సాహం కలుగచేయటం. లౌకిక అధ్యయనం మరియు ఆత్మిక స్వాధ్యాయం యొక్క ఉపయోగాన్ని బాగా అర్థం చేసుకొనడానికే సరస్వతీ పూజ చేయడం, ఇది మన ఆచారం. బుద్ధి కుశలత అత్యంత మహత్వపూర్ణమైన సంపదగా భావించాలి. అందుకనే డబ్బు సంపాదించడం, శక్తిని పెంచుకోవడం, సాధన సంపత్తులను ఏర్పరచుకోవటం, భోగభాగ్యాలతో గడపటం కంటే ఎక్కువగా దీనిపై ధ్యాస ఉంచాలి. లోకానికి ఉపయోగపడే ఈ ప్రేరణను గాయత్రి మహాశక్తి యొక్క ఒక మహత్వపూర్ణమైన భాగంగా లెక్కలోకి తీసుకొనబడినది. దీని నుంచీ లాభాన్ని పొందడానికి ప్రోత్సహించాలి.

# 15. లక్ష్మి

గాయత్రి యొక్క ఒకధార శ్రీ, శ్రీ అంటే లక్ష్మి, లక్ష్మి అంటే సమృద్ధి, గాయత్రి యొక్క కృపవలన కలిగే వరదానాలలో లక్ష్మి కూడా ఒకటి. ఎవరిపై ఈమె అనుగ్రహం కలుగుతుందో వారు దరిద్రం, దుర్బలత్వం, బానిసత్వం, అసంతుష్టి మరియు వెనుకబడినతనము లాంటి వాటికి లొంగిపోరు. స్వచ్ఛత మరియు సువ్యవస్థ యొక్క స్వభావాన్ని కూడా శ్రీ అని అంటారు. ఆ సద్గుణం ఎక్కడ ఉంటుందో దరిద్రం, కురూపత అక్కడ ఒక క్షణం కూడా ఉండవు.

పదార్థాన్ని మనుష్యునికి ఉపయోగపడేటట్లు చేయడానికి మరియు దానిని అభీష్ట మంత్రంతో లభింపజేయడానికి అవసరమయ్యే సామర్థ్యాన్ని లక్ష్మి అంటారు. లక్ష్మి అనే శబ్దం సంపత్తికి ప్రతిరూపం అని చెబుతుంటారు. వాస్తవంగా ఆమె చేతన యొక్క ఒక గుణము. దీని ఆధారంతో నిరుపయోగమైన వస్తువులను కూడా ఉపయోగకరంగా చేయవచ్చు. కొద్దిపాటిదైనా దానిని సంపూర్ణంగా సత్ ప్రయోజనాల కోసం వాడటం ఒక విశిష్ట కళ. అది ఎవరికైతే వస్తుందో వారిని లక్ష్మీపుత్రులని, **శ్రీమంతులు అని అంటారు. మిగతా డబ్బు ఉన్న వారిని ధనవంతులు అంటారు.** గాయత్రి యొక్క ఒక కిరణం లక్ష్మి, ఎవరికైతే ఇది లభిస్తుందో వారు స్వల్పసాధనాలతో కూడా డబ్బును ఉపయోగించే విధానం తెలియడం వల్ల ఎల్లప్పుడూ సుసంపన్నులుగా ఆనందంగా ఉంటారు. ధనం అధిక మొత్తంలో ప్రోగుజేసినంత మాత్రాన ఎవ్వరినీ సౌభాగ్యశాలి అని పిలవరు. సద్బుద్ధి కొరత వలన అది ఒక మత్తు పదార్థం లాగా పనిచేస్తుంది. అప్పుడు మనుష్యుడు అహంకారి, విలాసపురుషుడై దుర్వ్యసనాలకు లోనవుతాడు. సామాన్యంగా డబ్బు సంపాదించి మనుష్యులు కృపణులు, విలాసవంతులు, వ్యర్థంగా వ్యయం జేసేవారు, మరియు అహంకారులవుతారు. చెడు సంస్కారవంతులైన వ్యక్తులకు అనవసర సంపత్తి వచ్చినట్లయితే మూర్ఖులు అవుతారు. వారి ద్వారా అది దురుపయోగమవుతుంది. ఫలితంగా చివరికి వారు సర్వనాశనమై పోతారు.

లక్ష్మీదేవిని రెండు ఏనుగులు అభిషేకం జేస్తూ ఉంటాయి. ఆమె కమలమనే దివ్య ఆసనంపై కూర్చొని ఉంటుంది. కమలం కోమలత్వానికి ప్రతీక. కోమలత్వం, సుందరత సుకుమారంలోనే ఇమిడియుంది. ఈ సత్ప్రవృత్తిని కళ అని అంటారు. లక్ష్మీదేవికి ఇంకొక పేరు



కమల. ఈ కమలాన్నే సంక్షిప్తంగా కళ అని అంటారు. వస్తువులను, సంపదలను, మంచి పద్ధతిలో మంచి ఉద్దేశ్యం కొరకు ఉపయోగించుకోవడం, దానిని శ్రమ మరియు మనోయోగంతో పాటుగా నీతి మరియు న్యాయానికి కట్టుబడి జీవించడం కూడా "అర్థ" కళలో ఒక భాగంగా వస్తుంది. జీవనయానంలో తెలివి గలిగి మెలగడం శ్రీ తత్వం యొక్క అనుగ్రహం యొక్క పూర్వార్థము. ఉత్తరార్థం ఏమిటంటే ఇందులో ఒక పైసా కూడా వృథాగా ఖర్చు పెట్టకుండా ఉండటం. ప్రతి ఒక్క పైసా సదుద్దేశ్యం కోసం ఖర్చు పెట్టడం. లక్ష్మీదేవిని జలాభిషేకం జేసే రెండు గజరాజాలను పరిశ్రమ మరియు మనోయోగం అని అంటారు. వాటికి లక్ష్మీదేవితో అవిచ్ఛిన్నమైన సంబంధముంటుంది. ఈ ప్రక్రియ ఎక్కడైతే ఉంటుందో అక్కడ వైభవము, శ్రేయస్సు, సహకారం యొక్క కొరత ఉండదు. ఎవరైతే ప్రతిభావంతులో వారిపై సంపన్నత మరియు సఫలతల యొక్క వర్షం కురుస్తుంది. మరియు వారికి ముందుకు వెళ్ళే అవకాశాలు అడుగడుగునా లభిస్తాయి.

గాయత్రీ యొక్క తత్వదర్శనం మరియు సాధనా క్రమంలో ఒకధార లక్ష్మి. దీనివలన మనకు తెలిసేదేమిటంటే మనలో కౌశల్యం, సామర్థ్యం అభివృద్ధి చెందాలి. అప్పుడు మనం ఎక్కడ ఉన్నా లక్ష్మి యొక్క అనుగ్రహం, ఆశీస్సుల కొరత ఉండదు. ఇంతేకాకుండా గాయత్రి యొక్క ఇంకొకధార శ్రీసాధన, ఆ విధానాన్ని అనుసరించుటవలన చేతనత్వములో పడియున్న ఎన్నో శక్తులు మేల్కొంటాయి. దాని ఆకర్షణ శక్తి వలన ధనము, వైభవము తగినంత మనకు లభిస్తాయి. ప్రోగుజేసిన ఆ సంపదలను సరస్వతి దేవి ఒక చోట ఉంచకుండా పరమార్థ ప్రయోజనాలకోసం ఉపయోగించే ప్రేరణనిస్తుంది.

లక్ష్మీదేవి ప్రసన్నతకు, ఉల్లాసానికి, వినోదానికి ప్రతిరూపమైన దేవి. ఈమె ఎక్కడ ఉంటుందో అక్కడ నవ్వుట – నవ్వించుట అనే వాతావరణం ఏర్పడుతుంది. అస్వచ్ఛత కూడా దరిద్రమే. సౌందర్యము, స్వచ్ఛతలు కళాత్మక అలంకరణకు రెండవ పేరు. లక్ష్మి సౌందర్య దేవత. ఆమె ఎక్కడ ఉంటే అక్కడ స్వచ్ఛత, ప్రసన్నత, సువ్యవస్థ, శ్రమనిష్ఠ మరియు మిత వ్యయము యొక్క వాతావరణం ఏర్పడుతుంది.

గాయత్రి యొక్క లక్ష్మీధారను ఆరాధించేవారు శ్రీమంతులవుతారు మరియు ఆ ఆనందాన్ని వారొక్కరు అనుభవించక అసంఖ్యాకులకు లాభం కలిగించేట్లు చేస్తారు.

# 16. దుర్గ

గాయత్రి యొక్క ఒక ధార దుర్గ. దుర్గని కాళి అని కూడా అంటారు. కాళి మహాకాలుని యొక్క సహధర్మిచారిణిగా భావింపబడుతుంది. మహాకాలుడంటే సువిస్తృతమైన సమయ సౌరభం. కాలం యొక్క మహత్తును స్వీకరించేవారు, దాని ఉపయోగాన్ని అర్థం జేసుకొని సదుపయోగం చేసుకొనేవారు కాళీ ఉపాసకులని పిలువబడతారు.

సోమరితనంలో, శరీర స్తబ్ధతలో మానసికశక్తి నష్టమవుతుంది. దానిని కాపాడుకున్నట్లయితే సామాన్య మనుష్యుడు కూడా అభీష్ట ఉద్దేశ్యాలను, అద్భుత సాఫల్యాన్ని పొందగలుగుతాడు. సమయం అనేది ఈశ్వరుడు ప్రసాదించిన ఒక గొప్ప వరం. దానిని ఉపయోగించుకొని మనుష్యుడు ఎటువంటి సాఫల్యాన్ని పొందాలనుకొన్నట్లైతే, అటువంటి దానిని సాధించగలుగుతాడు. భగవంతుడు సూక్ష్మస్వరూపుడు. అతని పుత్రుడు అయిన జీవుడు కూడా సూక్ష్మ స్వరూపమే. తండ్రి నుంచి కుమారునికి మానవ జన్మ అనే ఒక మహత్తరమైన అనుదానము లభించింది. దానిని సోమరితనంతో స్తబ్దతతో వృధా జేయకుండా విశేష ప్రయోజనం కోసం ఉపయోగిస్తే దాని ప్రతిఫలంగా ప్రాపంచికమైన ఆధ్యాత్మిక సంపదలు కోకొల్లలుగా లభ్యమవుతాయి. ఈ సత్యం గాయత్రి యొక్క కాళీ శక్తిధార వలన స్పష్టమవుతుంది.

ప్రతిరోజూ తీరికలేని ప్రణాళిక తయారుచేసుకొని ఆ ప్రయత్నంలో ప్రాణాన్ని ఫణంగా పెట్టి, ఏకాగ్ర చిత్తంతో ఆ పనిలో నిమగ్నమవటం ఇష్ట ప్రాప్తిని పొందటానికి సరియైన మార్గం. ఈ పద్ధతిలో అత్యంత శ్రద్ధ కలిగి, సంకల్పము చేయుటచే మహా మానవులగుట సాధ్యమవుతుంది. కాళీ మాతకు వేరే పేర్లు కూడా ఉన్నాయి. దుర్గా, చండీ, అంబ, శివా, పార్వతి మొదలైన అనేక పేర్లతో పిలుస్తారు. కాళీమాతకు మరొకపేరు సంఘశక్తి. ఒంటరితనం ఎప్పుడూ అసంపూర్ణంగా ఉంటుంది. ఎంతటి



సమర్థులైనా, సుయోగ్యులైనా, సుసంపన్నులైనా, ఎవరికి ఎంత సహకారం లభిస్తుందో, వారు దానిని బట్టి పురోగమిస్తారు. సంఘటిత శక్తి అపారమైనది. వ్యక్తి యొక్క, సమాజం యొక్క ప్రగతి, సమృద్ధి, శాంతికి ఆధారం సామూహికత మరియు సహకారం. ఇప్పటివరకు మానవుడు సాధించిన ఉపలబ్ధులన్నీ సహకారం యొక్క వాతావరణంలోనే సాధ్యమయ్యాయి. భవిష్యత్తులో కూడా కొన్ని మహత్వపూర్ణమైన వాటిని పొందాలంటే సామూహిక ఉపాయం ద్వారానే సాధ్యమవుతుంది.

దుర్గ అవతారానికి ఒక కథ ఉంది. అసురుల బారి నుంచి దేవతలను కాపాడేందుకు ప్రజాపతి వారి శక్తులను ఒక చోటకు చేర్చి వానికి కాళీ రూపాన్ని ప్రసాదించి ప్రచండమైన శక్తిని ఉత్పన్నం చేశారు. ఆ చండీమాత రాక్షసులను శక్తిహీనులను జేసింది. అంతేకాక దేవతలకు ఉచిత స్థానాన్ని ప్రసాదించింది ఈ కథలో ఇదే ప్రతిపాదన ఉంది. సామూహిక శక్తి అపారమైనది. దీనిని ఎటువంటి ప్రయోజనం కోసం వాడినా దానిలో అసాధారణమైన ప్రతిభ, సఫలత లభిస్తూ పోతుంది.

దుర్గ వాహనం సింహం. అది పరాక్రమానికి ప్రతీక, దుర్గ యొక్క కార్యకలాపాలలో సంఘర్షణ ప్రధానమైనది. జీవన సంగ్రామంలో విజయాన్ని పొందడానికి ప్రతి ఒక్కరూ ఆంతరిక దుర్బలతలు మరియు స్వాభావికంగా వచ్చిన దుష్ ప్రవృత్తులతో నిరంతరం పోరాడుతూనే ఉండాలి. బాహ్యజీవితంలో కూడా అవాంఛనీయతలు, ఆక్రమణలు, అవరోధాలు ఎదురవుతాయి. వాటితో సంఘర్షణపడితే తప్ప వేరేమార్గం లేదు. అందరూ శాంతిగా ఉండాలని కోరుకొంటారు. కాని ఆక్రమణలు, అవరోధాల నుంచి బ్రతికి బయటపడటం చాలా కష్టం. దానితో సంఘర్షణ తప్ప వేరే మార్గం లేదు. అటువంటి సాహసం, శౌర్యం పరాక్రమం యొక్క ఉద్భవం గాయత్రిలో అంతర్నిహితమైన దుర్గాతత్వం వలననే సంభవం అవుతుంది. గాయత్రి ఉపాసన వలన మన అంతరాళములో అటువంటి తేజస్సు, శక్తి ఉత్పన్నమౌతాయి. దీనినే దుర్గా అనుగ్రహం సాధకునికి లభించుట అని అంటారు.

# 17. కుండలిని

గాయత్రి యొక్క ఒక శక్తిధార కుండలిని. జీవాత్మను చుట్టుకొని అత్యంత సన్నిహితమైన భౌతికశక్తి కుండలిని. ప్రాణ విద్యుత్తు, జీవనీశక్తి, ఉత్సాహి, యోగాగ్ని మొదలైన పేర్లతో పిలువబడుతున్నది. నరాలు నాడులలో ఒక చైతన్య విద్యుత్తు క్రియాశీలంగా ఉన్నది. దీని రెండు చివరలు ధ్రువకేంద్రాలుగా భావించవచ్చు. దీని కేంద్రాలు పృథ్వి యొక్క ఉత్తర దక్షిణ ధ్రువాల వంటివి. ఉత్తర ధ్రువము మస్తిష్కపు మధ్య బిందువైన బ్రహ్మరంధ్రము. ఈ స్థానంలోనే సహస్రార చక్రము ఉన్నది. దీనికి తిన్నగా బ్రహ్మ చైతన్యముతో సంబంధము ఉన్నది. ఉత్తర ధృవ కేంద్రపు అయస్కాంత తత్వము, తనకు ఆవశ్యకమైన పదార్థాలనన్నిటిని బ్రహ్మాండములో ఉన్న గ్రహ భాండాగారం నుండి అందుబాటులోకి తెచ్చుకుంటుంది. అలాగే వ్యాపక బ్రహ్మ చైతన్య భాండాగారంలో నిక్షిప్తమైన దివ్యశక్తుల నుండి తనకు అవసరమైన సామర్థ్యాలను కోరుకున్న మోతాదులో సహస్రార చక్రము సమకూర్చుకుంటుంది. బ్రహ్మరంధ్రంలోని కుండలిని యొక్క చివరను "మహాసర్పము" అని అంటారు. దీని ఆకృతి కుండలాకారంలో ఉంటుంది. దీనినే శేషనాగు, శివసర్పము అని కూడా అంటారు. గాయత్రి ఉపాసన వలన ఈ మహాసర్పం మూర్ఛ నుండి మేల్కొల్పబడుతుంది. దాని ప్రచండ సామర్థ్యంతో ఆధ్యాత్మిక క్షేత్రంలో అసంఖ్యాక విభూతుల లాభం పొందవచ్చు.

కుండలిని యొక్క రెండవ చివర మూలాధార చక్రం. ఇది మల, మూత్ర ఛిద్రముల మధ్య ఒక చిన్న శక్తి కేంద్రము ఉన్నది. దీనిని దక్షిణ ధృవ సమతుల్యమనవచ్చు. మానవ శరీరంలో బలం యొక్క ఉత్పాదన, పంపిణీ ఇక్కడ నుండే జరుగుతుంది. సంతానోత్పాదక సామర్థ్యం ఇదే. స్ఫూర్తి ఉల్లాసం, సాహసం వంటి విశిష్టతలు ఇక్కడే ఉద్భవిస్తాయి. మానవ శరీరంలో పనిచేసే అనేక శక్తులకు జన్మస్థానం ఇదే. స్థూల శరీరంలో మస్తిష్కము, హృదయమును ప్రధాన అవయవాలుగా భావించారు. సూక్ష్మశరీర మస్తిష్కము సహస్రార చక్రము, మహాసర్పము; దాని హృదయము మూలాధారచక్రము. మూలాధారాన్ని కుండలిని యొక్క దక్షిణ ధృవంగా భావించారు. రెండు ధృవాల మధ్య ప్రవాహము ప్రసుప్తిలోపడి ఉంటుంది. ఫలితంగా మనుష్యుడు ఇతర ప్రాణులవలెనే, ఉదర, శిశ్నపరాయణతల వంటి శరీర నిర్వహణ యొక్క తుచ్ఛమైన పనులే చేస్తూ ఉంటాడు. కుండలిని జాగరణ వలన దివ్య ఉత్సాహం జాగృతమై, మనుష్యుని సామర్థ్యం అసామాన్యంగా అభివృద్ధి అవుతుంది. మూలాధారంలో ఉన్న సర్పిణి అనగా ప్రాణ ఉత్సాహం, సహస్రారంలో ఉన్న మహాసర్పం-బ్రహ్మచేతనల మధ్య ఇచ్చిపుచ్చుకొనే ద్వారం తెలుసుకున్నప్పుడే కుండలినీ జాగరణ అని అంటాము. విద్యుత్ యొక్క రెండు తీగెల కలయిక వలన శక్తిశాలియైన ప్రవాహం ప్రారంభమైనట్లే, భౌతిక ఆత్మిక సామర్థ్యాల కలయిక వలన చమత్కార పరిణామాలు ఏర్పడతాయి.



మస్తిష్క సామర్థ్యాన్ని పరిష్కరించే పని యోగ సాధనల ద్వారా చేయబడుతుంది. ప్రాణ ఉత్సాహంలో ప్రచండతను ఉత్పన్నం చేయుట, దాని సామర్థ్యంతో భౌతిక, ఆత్మిక శక్తులను పుష్టివంతం చేయుటయే తంత్ర విజ్ఞానము. కుండలినీ తంత్ర విద్యకు అధిష్ఠాత్రి. భూలోక ప్రతినిధి మూలాధారం, బ్రహ్మలోకానికి సహస్రారం. రెండింటి మధ్య రాకపోకలు దేవయాన మార్గం నుండి జరుగుతాయి. మేరుదండమే దేవయానము. ఈ మార్గంలో షట్చక్రాలున్నాయి. ఏడవ లక్ష్యబిందువు సహస్రారము. ఇవే సప్తలోకాలు, సప్తసాగరాలు, సప్తగిరులు, సప్తఋషులు, సప్తతీర్థాలు, సప్తద్వీపాలు, సప్తాహము, సప్తధాతువులు మొ॥న రూపాలలో విస్తరించబడి ఉన్నాయి. కుండలినీ జాగరణతో దేవయాన మార్గంలోని ఈ సప్త సోపానాలన్నీ జాగృతమవుతాయి. సాధకుని శక్తిలో దివ్య సామర్థ్యాలతో సుసంపన్నమవుతుంది.

మనుష్యునిలో ప్రాణ ఉత్సాహము యొక్క ప్రచండశక్తి మూలాధారచక్ర కేంద్ర బిందువులో ఉండి, అక్కడి నుండే సమస్త శరీరంలో పరిభ్రమిస్తూ సామాన్యజీవనంలోని అనేక ప్రయోజనాలు నెరవేరుస్తూ ఉంటుంది. ఇది జననేంద్రియాల ద్వారా సక్రియమై ఒక క్రొత్త మనిషిని ఉత్పన్నం చేసే సామర్థ్యం కలిగి ఉండుట ద్వారా దీని అసాధారణ సామర్థ్యాన్ని అర్థం చేసుకోవచ్చు. మనుష్యునిలో శౌర్యము, సాహసము, పరాక్రమము, ఉత్సాహము, ఉల్లాసము, స్ఫూర్తి పొందుట వంటి అనేక ప్రత్యేకతలను సామర్థ్యాలను ఇక్కడి నుండే ఉదయింప చేస్తుంది. కామోత్తేజనలో దీని సామర్థ్యపు కదలికలను దర్శిస్తాము. సంతానోత్పత్తిలో బహుశః దీని శక్తిలో ఎక్కువ భాగం నష్టమవుతున్నది.

సామాన్య ప్రాణాన్ని మహాప్రాణంగా పరిణితి చెందించి, బ్రహ్మరంధ్రము వరకు చేర్చి, అక్కడి ప్రసన్న శక్తి భాండారమును మేల్కొలిపి మనుష్యుని దేవతగా చేయుటయే కుండలినీ జాగరణ ఉద్దేశ్యము. సముద్రమధ్యంలో 14 రత్నాలు వెలువడినట్లే, కుండలిని యొక్క శక్తి సాగర మంథనం కూడా, దివ్యశక్తుల రత్నరాశుల ద్వారాలు సాధకుడి కొరకు తెరుస్తుంది. అధోగతి నుండి ఊర్ధ్వగతికి పరిణితి చెందించే ఈ ప్రక్రియయే కుండలినీ జాగరణ. ఈ సాధనలో వామబీజము శక్తి బీజంగా పరివర్తించబడుతుంది. కాళి-మహాకాలునితో, శివుడు-శక్తితో, ప్రాణము-మహాప్రాణముతో కలయుట వలన ఆ సంయుక్త శక్తి చమత్కార పరిణామాలను ఉత్పన్నం చేస్తుంది. ఇదియే కుండలినీ జాగరణ. గాయత్రి యొక్క ఈ ఒక ప్రవాహము కుండలినీ జాగరణను గాయత్రి యొక్క తంత్ర సంబంధ ఉపలబ్ధి అని చెప్పవచ్చు.

కుండలినీ జాగరణ ప్రక్రియ గాయత్రీ సాధనలో భాగంగా సులువవుతుంది. హఠయోగం, ప్రాణయోగం, తంత్రయోగం మొ॥న వాటి ద్వారా ఒక హద్దు వరకు జాగృతం చేయవచ్చు. కానీ పరిపూర్ణ ఉపయోగశక్తి, జాగరణ గాయత్రి ద్వారానే అవుతాయి. గాయత్రీలోని 24 శక్తులలో కుండలిని కూడ ఒకటి. గాయత్రీ సాధన యొక్క సౌమ్య ప్రక్రియను అనుసరించి సాధకులు కుండలినీ జాగరణ లాభాన్ని, అధిక నిశ్చింతగా, ఏ విధమైన ప్రమాదంలో పడకుండా, సులువుగా పొందవచ్చును.

# 18. ప్రాణాగ్ని

గాయత్రి యొక్క 24 ప్రధాన పేర్లలో, రూపాలలో ప్రాణాగ్ని కూడా ఉన్నది. ప్రాణము ఒక సర్వవ్యాపియైన చేతనా ప్రవాహము. అది ప్రచండమైనప్పుడు దాని ఉత్సాహము అగ్నియై ప్రకటితమవుతుంది. ప్రాణతత్వము యొక్క ప్రఖరత ప్రచండతా స్థితిని ప్రాణాగ్ని అంటారు. దహించుట, ప్రకాశించుట, తనలో విలీనము చేసుకొనుట అనే అగ్ని గుణాలతో అందరూ పరిచితులే. ప్రాణాగ్ని దివ్య సామర్థ్యం ప్రకటితమైనచోట కషాయము, కల్మషము నశించే తీరుతాయి. దీని సామర్థ్యము ఉత్పన్నమైనప్పుడు అంధకారము ఉండదు, అంతా ప్రకాశమే ఉంటుంది. ప్రాణాగ్ని వలన మీ సంపర్క క్షేత్రమును స్వంతం చేసుకోగల్గుతారు. పదార్థాలు, ప్రాణాలు అనుకూలమవుతాయి. అనురూపమై అనుసరిస్తాయి. ప్రాణాగ్ని సంపన్నులైన వ్యక్తులను ఓజస్వి, తేజస్వి, మనస్విగా పేర్కొంటారు.

ప్రాణాగ్ని విద్యనే పంచాగ్ని విద్యగా చెప్పారు. కఠోపనిషద్‌లో యముడు నచికేతునికి ఈ పంచాగ్ని విద్యను బోధించి కృతకృత్యుణ్ణి చేశాడు. ఇది పంచ ప్రాణముల విజ్ఞానము, వినియోగము. దీనిని తెలుసుకొని అనుసరించేవాడు నిజమైన అర్థములో మహాప్రాణమవుతాడు.



గాయత్రియే ప్రాణాగ్నిగా చెప్పబడింది. గాయత్రీ శబ్దార్థము "ప్రాణము రక్షించునది" అని. ప్రాణశక్తి సంపన్నులుగా చేయుటయే గాయత్రీ సాధనకు ప్రముఖ ప్రతిఫలము. సత్ప్రయోజనాల కొరకు సాహసికతను చూయించుటను బట్టి ప్రాణవంతులైనట్లు తెలుస్తుంది. సామాన్యులు స్వార్థ సిద్ధి కొరకు దుష్కర్మలలో దుస్సాహసం ప్రదర్శిస్తుంటారు. సత్కర్మల గురించి ఎప్పుడైనా కల్పన మాత్రము చేస్తారేమో, అందుకు ఎంతో కొంత చేస్తూ ఉండాలి. ఆదర్శాలు స్వీకరించినవారు జీవిత క్రమంలో కఠోర సంయమము, అనుశాసనము అలవరచుకోవాలి. హేయమార్గంలో నడిచేవారితో విరోధము, అసహాయోగము చేయాల్సి వస్తుంది. ఈ ప్రబల పురుషార్థములో మహాప్రాణులే సఫలురవుతారు. సత్ప్రయోజనాలలో సాహసము, త్యాగము బలిదానము ఆదర్శాల నిర్వహణలో ముందడుగు ప్రాణ సంపన్నతను తెలియజేస్తుంది.

అవినీతితో పోరాడుట, కఠిన పరిస్థితులలో ధైర్యం వహించుట నిరాశాజనక పరిస్థితులలో ఉజ్జ్వల భవిష్యత్తును ఊహించుటను బట్టి ప్రాణవంతులని తెలియవస్తుంది. గాయత్రీ ఉపాసన వలన ఈ ప్రఖరత అభివృద్ధి అవుతుంది.

# 19. భవాని

గాయత్రీకి మరొక పేరు భవాని. ఈ రూపములో ఆదిశక్తిని ఉపాసించుట వలన అవాంఛనీయతలతో పోరాడి ఓడించగలిగిన భర్గ-తేజస్సు అభివృద్ధి అవుతుంది. దీనిని ఒకశక్తిధారగా కూడా చెప్పుకోవచ్చు. భవానికి పర్యాయపదాలు దుర్గా, చండి, భైరవి, కంకాళి మొ॥ దీని ముఖముద్ర, భావచేష్ట భయం గొలిపేదిగా ఉంటుంది. సంఘర్షణలో ఆ గతి విధులు వినియోగించబడతాయి. ఆమె వాహనము సింహము. సింహము పరాక్రమము, ఆక్రమణకు ప్రతీక. శత్రువును ఛిన్నాభిన్నం చేసే ఆయుధాలు చేతుల్లో ఉన్నాయి. కరవాలాన్ని కూడా భవాని అని అంటారు. అవాంఛనీయతను ఎదుర్కొనుటయే దాని ప్రయోజనం. అసురుల శస్త్రాలు ఇతరులను పీడించుటకు ప్రయోగించబడతాయి. అవినీతికి విరుద్ధంగా నీతికి సమర్థనగా ఉపయోగించబడినప్పుడు ఆ ఆయుధాలను భవాని అని అనవచ్చు. ధర్మము యొక్క ఒక పక్షము సేవ, సాధన, కరుణ సహకారము, ఉదారత రూపంలో ఉంటుంది. ఇది సానుకూల సృజనాత్మక పక్షము. రెండవ పక్షము అవినీతిని వ్యతిరేకించేది, ఇది లేకుండా ధర్మము పూర్ణము కాదు, సురక్షితం కాదు. సజ్జనత్వమును రక్షించి దుష్టత్వాన్ని ఎదుర్కోవటం అవసరం. ఈ ఎదుర్కొనే శక్తినే భవాని అని అంటాము. దుర్గ, చండి పేరుతో ఈమె లీలలనే వర్ణిస్తూ ఉంటాము. దేవీ భాగవతంలో విశేషంగా, ఇతర పురాణాలలో ఉప పురాణాలలో సామాన్యరూపంలో ఈ మహాశక్తి వర్ణించబడింది. అసుర సంహారిణి, సంకట నివారిణిగా చిత్రించబడింది. అవతారాలకు రెండు లక్ష్యాలు. ఒకటి ధర్మసంస్థాపన, రెండవది అధర్మశాసనం. రెండూ పరస్పర పూరకాలు. సృజన, ధ్వంసము, ఈ రెండూ అవలంభించినపుడే సువ్యవస్థ ఏర్పడుతుంది. భోజనము ఎంత అవసరమో మలవిసర్జన కూడా అంతే. ఉత్పత్తి, అభివృద్ధితోపాటు, ఆక్రమణల నుండి రక్షించుకొనుట కూడా అసవరమే. ప్రభుత్వము ప్రజాపాలనేకాక వారి రక్షణకు సేన, పోలీస్ వంటి వానిని ఏర్పాటు చేస్తుంది. రైతు పొలాన్ని తోటమాలి తోటను పెంచుటతోపాటు కాపాడుట కూడా చేయవలసి ఉంటుంది. లేకపోతే వారి శ్రమ అంతా వృథా అవుతుంది. సజ్జనుల సంరక్షణ ఎంత అససరమో దుష్టత్వ నిర్మూలన అంతే అవసరం. వీటిలో ఏదో ఒకటే అనుసరించుట వలన సువ్యవస్థ సాధ్యం కాదు.



సంఘర్షణ యొక్క మొదటి చరణంలో మన దుర్బుద్ధిని ఎదుర్కొనాలి. నీచస్థాయి దుర్భావనలు, దురాలోచనలు అంతరాళంలో పేరుకొని వ్యక్తిని పరాభవం, పతనం అనే అగాధంలోకి పడదోస్తాయి. దురలవాట్లకు వశమై మనుష్యుడు దుర్వ్యసనాలు, దుష్కర్మలలో చిక్కుకుంటాడు. ఫలితం నానారకాల క్లేశాలు, కష్టాలలో పడిపోతాడు. వ్యక్తిత్వంలో చొరబడిన కల్మషము, కుసంస్కారాల నిర్మూలనకు విభిన్న తప-తితీక్షలు ఆశ్రయించాలి.

ఈ దుష్ప్రవృత్తులు లోక వ్యవహారములో సోమరితనము, అజాగ్రత్త, అశుభ్రత, అశిష్టత, అవ్యవస్థ, సంకీర్ణ స్వార్థపరత్వ రూపంలో వ్యక్తమై మనుష్యుడు ఉపేక్షితుడు తిరస్కృతుడవుతాడు. ఇవి ఎక్కువైతే వ్యక్తి దుష్ట భ్రష్టాచరణ చేస్తూ పశువు పిశాచం అనబడతాడు. వాసనా, తృష్ణ అహంకారములు పెరుగుటతో మనుష్యుడు అసామాజిక, అవాంఛనీయ, ఉశ్శృంఖల, ఆక్రమణ దారుడవుతాడు. ఫలితంగా అసహ్యించుకోబడుట, బాధించుట వంటి దండన అనుభవించవలసి వస్తుంది. ఈ స్థితి నుండి ఎదిగితేనే వ్యక్తి సంస్కారవంతుడు, వికాసశీలి అవుతాడు. ఆత్మశోధన యొక్క సాహసము కూడా భవానీయే. ఆత్మను జయించుటయే అన్నింటికన్నా పెద్ద విజయం.

సమాజంలో సహకారము, సజ్జనత్వము, సృజనాత్మక కృషిలో దుష్టత్వము, దుర్మార్గాలు తక్కువేమీ కాదు. అవాంఛనీయతలు, అనైతికతా మూఢ ఆచారాల వల బాగా విసరబడి ఉన్నది. వాటి కారణంగానే అనేకానేక వ్యక్తిగత సామాజిక సమస్యలు తలెత్తుతూ, వికృతులు పెరుగుతూ ఉన్నవి. వీటితో పోరాడటానికి వ్యక్తిగతంగా సామూహికంగా ప్రచండ కృషి సలపాలి. ఈ ప్రయత్నశీలతనే చండి అని అంటారు. ఇదే భవాని. సృజన, సంఘర్షణ అనే పరస్పరాశ్రిత తత్వములలో సంఘర్షణ ఆవశ్యకతను గుర్తించి అనుసరించేందుకు ప్రోత్సహించే స్వరూపమే భవాని. సద్బుద్ధి అధిష్టాత్రి గాయత్రి యొక్క ఒక పక్షము సంఘర్షణ శీలము, శౌర్యము, సాహసములను మార్గదర్శనం చేస్తున్నది. గాయత్రిసాధన వలన ఈ శక్తి యొక్క సహజ అభివృద్ధి జరుగుతుంది.

# ౨౦. భువనేశ్వరి

భువనేశ్వరి అంటే విశ్వఐశ్వర్యమున కంతటికి స్వామిని. పదార్థాల ద్వారా లభించే సుఖ సాధనాలను వైభవము అంటారు. ఐశ్వర్యము ఈశ్వరీయ గుణము. అది ఆంతరంగిక ఆనందం రూపంలో లభిస్తుంది. ఐశ్వర్యపరిధి చిన్నది కావచ్చు, పెద్దది కావచ్చు. చిన్నచిన్న సత్ప్రవృత్తుల వలన అవి చరితార్థమయ్యే సమయంలో తత్కాలంలో లభించేది చిన్న ఐశ్వర్యం. ఇది స్వయంగా సంపాదించిన, పరిమిత ఆనందమిచ్చే పరిమిత సమయం వరకు ఉండే ఐశ్వర్యం. ఇది స్వల్పకాలిక అనుభూతియైనా దాని మధురరసాస్వాదనంతో మరింత సంపాదించుకొనేందుకు ప్రోత్సాహం లభిస్తుంది.

భువనేశ్వరి ఇంతకంటే ఉన్నత స్థితి. సృష్టి అంతటా ఉన్న ఐశ్వర్యంపై ఆమెదే అధికారం. స్వామి రామతీర్థ తనను 'రామ బాదషాహ్' అని చెప్పేవాడు. తాను విశ్వానికి అధిపతిననే అనుభూతి కలిగేది. ఫలితంగా విశ్వాధిపతి పొందే ఆనందాన్ని పొందుతూ ఉండేవాడు. చిన్న చిన్న పదవులు పొందేవారు, పరిమిత వస్తువులకు యజమానులయ్యేవారు అహంను తృప్తి పరుచుకుంటే, గౌరవం పొందుతూ ఉంటే సమస్త విశ్వాధిపతి అయిన అనుభూతి ఎంత ఉత్సాహవర్ధకంగా ఉంటుందో? ఊహించుకుంటేనే మనస్సు ఆనందంతో గంతులు వేస్తుంది. రాజు ఒక చిన్న రాజ్యానికి యజమాని, అతడు తనను ఎంతో గొప్ప వ్యక్తిగా, సౌభాగ్యవంతుడుగా, గౌరవనీయుడుగా భావిస్తాడో మనందరికీ తెలుసు. ఆధిపత్యము వలన గౌరవము, ఆనందము లభించుట వలననే చిన్న పెద్ద పదవులకు పోటీ ఉంటున్నది.

వైభవం గురించి మాట్లాడుకుంటున్నాము. ఇది మానవీయము, భౌతికము. ఐశ్వర్యదేవి భువనేశ్వరి ఆధ్యాత్మికము, భావనాత్మకము. దీని ఆనందం ఆ నిష్పత్తిలో చాలా అధికంగా ఉంటుంది. భువనమంతటి చైతన్యాత్మక ఆనందానుభూతి యొక్క ఆనందం దేనిలో నిండి ఉన్నదో అదే భువనేశ్వరి. గాయత్రి యొక్క ఈ దివ్యధార ఎవరిపై అవతరిస్తుందో వారికి నిరంతరం విశ్వ



ఐశ్వర్యాధిపతియైన సౌభాగ్యం లభించిందని అన్పిస్తుంది. వైభవంతో పోల్చినపుడు ఐశ్వర్యం యొక్క ఆనందం అనేక రెట్లు ఎక్కువ. ప్రాపంచిక దృష్టిలో సుసంపన్నులనుకోబడే వారి కంటే భువనేశ్వరి భూమికలో ప్రవేశించిన సాధకులు దాదాపుగా స్వయంగా భువనేశ్వర భగవానుని వంటి అనుభవాన్ని పొందుతారు.

భావనా దృష్టిలో ఈ స్థితి పరిపూర్ణ ఆత్మగౌరవం యొక్క అనుభూతి. ఈ స్థాయి సాధకుడు బ్రాహ్మీస్థితిలో ఉంటాడు, దాని వలన వాని వ్యాపకత్వము, సమర్థత దాదాపుగా పరబ్రహ్మ స్థాయిలో ఉంటుంది. అతడు భువనమంతటా విసరి వేయబడి ఉన్న విభిన్న ప్రకారాలైన పదార్థాలను నియంత్రణ చేయగల్గుతాడు. పదార్థాలు, పరిస్థితుల ద్వారా పొందే ఆనందాన్ని తన సంకల్ప బలంతో అభీష్ట పరిమాణంలో ఆకర్షించుకొని ఉంచుకోగలడు.

భువనేశ్వరి మనఃస్థితిలో విశ్వమంతటా ఉన్న అంతఃచేతన తన దాయిత్వమునకు లోబడి ఉన్నదని భావిస్తుంది. దాని సువ్యవస్థకు కృషి చేస్తుంది. శరీరము, కుటుంబమునకు యజమానిననుకునేవారు వాటికోసం ఏదో ఒకటి చేస్తూ ఉంటారు. విశ్వమంతా తన పనిముట్టు అనుకునేవారు నిరంతరం విశ్వహితం గురించే శ్రద్ధ వహిస్తారు. కుటుంబ సుఖం కోసం శరీర సుఖాన్ని త్యాగం చేసి ప్రబలపురుషార్థం చేస్తారు. విశ్వపరివారమనే అనుభూతి చెందినవారు జీవజగత్తుతో ఆత్మీయతను సాధన చేస్తారు. వాటి పీడా నివారణకు పూర్తి కృషి చేస్తారు. తమ సామర్థ్యాలన్నిటిని వ్యక్తిగత స్వార్థం కోసం వినియోగించక, వ్యాపక విశ్వ సుఖశాంతులకు వినియోగిస్తారు.

వైభవ సంపాదనకు భౌతిక పురుషార్థం అవసరము. ఐశ్వర్య ఉపలబ్ధి పురుషార్థం వలననే సాధ్యం. వ్యాపక ఐశ్వర్య అనుభూతి, సామర్థ్యప్రాప్తికి సాధనాత్మక పురుషార్థం చేయవలసి ఉన్నది. గాయత్రీ ఉపాసనలో ఈ స్థాయి సాధన ఏ విధి - విధానం క్రింద వస్తుందో దానినే భువనేశ్వరి అంటారు.

# 21. అన్నపూర్ణ

జీవి ప్రత్యక్ష అవసరాలలో మొదటిది అన్నము. భోజనము కొరకు ఉపయోగించే ధాన్యాలు, అన్య పదార్థాలను అన్నమనే అంటాము. గాయత్రి యొక్క ఒక శక్తి అన్నపూర్ణ. దీని ప్రభావం అన్నది అవసరాల సహజ పూర్తిలో మనకు తెలియవస్తుంది. దాదాపుగా గృహలక్ష్ములను అన్నపూర్ణ అంటాము. వారు తమ దూరిదర్శిత్వము, సువ్యవస్థ ద్వారా లేమి, లోటు, కష్టము, అసంతోషం, ఎగతాళికి గురికాకుండా ఉండేటట్లు చేయగల్గుతారు. గృహలక్ష్ముల వంటి సుసంస్కారవంతులైన బుద్ధిమంతులను కూడా అన్నపూర్ణ అనే అంటారు. వారు ఉన్నచోట దరిద్రము కాలుమోపదు. పరిస్థితులు సంతోషజనకంగా ఉంటాయి. గాయత్రి యొక్క ఈ శక్తిద్వారా లేమిలోటు తటస్థపడవు. ఆవశ్యకతల పూర్తి గురించి ఆందోళన ఉండదు. తుష్టి, తృప్తి, శాంతిల మనఃస్థితికి వస్తు సామాగ్రి బాహుళ్యంతో సంబంధములేదు. ఆజ్యం వలన అగ్ని మరింత ప్రజ్వరిల్లుతుంది. శాంతి అంటే జలం. జలం అంటే సంతోషం. సగటు మనిషి అవసరాలతో సరిపెట్టుకోవటం. అహం తృప్తికి వైభవ ప్రదర్శన కాకుండా ఆదర్శ నిర్వహణే ఉత్తమమని భావించటం. ఈ విధమైన సద్బుద్ధి ఉంటే జీవనసంపద తనంతట తాను సంపూర్ణము. దానిలో విభూతుల అనంత భాండారం ఉన్నది. వాస్తవిక అవసరాలు నెరవేర్చే సాధనాలు తగినన్ని సహజంగానే లభిస్తాయి.

ఈ అనుభూతి వలన మనుష్యుడు సంపద ప్రోగుచేసుకోవటం, వైభవ ప్రదర్శన నుండి విరక్తుడవుతాడు. తన సామర్థ్యాన్ని ఆదర్శ నిర్వహణలో వినియోగిస్తాడు. వ్యక్తిత్వాన్ని మహోన్నతం చేసుకోవాలని ఆకాంక్షిస్తాడు. తన పౌరుషాన్ని లోక కల్యాణ సాధన కొరకు వినియోగిస్తాడు. సృష్టికర్త యొక్క ఈ విశ్వవాటికను అధికాధిక సుందరంగా తీర్చిదిద్దేందుకు, సఫలత అసఫలతతో సంబంధం లేకుండా, చేసే ప్రయత్నంలోనే సంతోషం లభిస్తుంది. ఈ విశ్వాసాన్నే నమ్మకాన్నే 'అన్నపూర్ణ' అంటారు. గాయత్రీ యొక్క ఈ శక్తిధార అన్నపూర్ణ సాధకునికి స్వర్గీయ ఆనందంతో సమానమైన రసాస్వాదనను నిరంతరం కలిగిస్తుంది.

గాయత్రీ ఉపాసకుల ఆర్థిక స్థితి సంతోషజనకంగా ఉండి ధన ధాన్యాలకు ఏ లోటూ ఉండదు. అసంతోషాగ్నిలో దహించబడుట, లిప్స-లాలసలలో ఉద్విగ్నుడయ్యే ఆపద కలుగదు. వారికి ఆకాశం నుండి ధాన్యవర్షం కురుస్తుందని, పండే దానికంటే



నాలుగు రెట్లు పండుతుందని కాదు, తగిన యోగ్యత పెంచుకొనుట, కఠినశ్రమ చేయుటకై సిద్ధమై యుండుటయే కారణము. సోమరులు, అలక్ష్యంగా ఉండేవారు దరిద్రులుగా ఉంటారు. ఎవరు పురుషార్థ పరాయణులో, మనస్సు పెట్టిన సృజనాత్మక కార్యకలాపాలలో నియోగిస్తారో వారి నిర్వహణకు అవసరమైన వస్తువుల, సాధనాల కొరత ఎన్నడూ రాదు. ఈ అన్నపూర్ణ ప్రవృత్తి గాయత్రీ ఉపాసకుల స్వభావంలో ఒక అంగముగా అవుతుంది.

అన్నపూర్ణ ప్రవృత్తికి రెండో పక్షము – మిత వ్యయము. లభించిన వాటిని శారీరిక, కుటుంబ, పారమార్థిక అవసరాలకు తగినట్లుగా సర్దుబాటు చేసుకోగలుగుతాడు. ఇటువంటి సుసంస్కారము అలవర్చుకోకపోతే కుబేరుడైనా దరిద్రుడు కాక తప్పదు. వ్యసనాలు, విలాసం, ఆడంబరాలు పొగడ్తలకు ఉబ్బిపోవుట, పనిపాటు లేకుండా గడపుట వంటి దుర్గుణాలకు ఎంతైనా అపవ్యయం చేయవచ్చు. అటువంటప్పుడు ఎంత ఆదాయమున్నా అవసరాలకు ఇబ్బంది తప్పదు. అవసరాల పూర్తికోసం లంచం, మోసం వంటివి తలెత్తుతాయి. అయినా సంతోషజనక పరిస్థితి ఉండదు. ఆదాయ-వ్యయాల మధ్య సంతులనం కుదరదు. సంతులనమే సంపన్నత. ఇది ధనాన్నిబట్టి ఉండదు. సంపాదన పెంచుకునేందుకు నిరంతరం కృషి చేయుట మీదనే ఇది ఆధారపడి ఉన్నది. ఒక్కొక్కపైసా ఆలోచించి ఖర్చు చేయాలి. పరిమిత ఆదాయంతో కూడా సుఖంగా ఉండవచ్చు. ఈ సువ్యవస్థను చూచి సంపన్నులు కూడా ఈర్ష్య పడవచ్చు. ఈ పరిస్థితి పేరే అన్నపూర్ణ.

వస్తువులు సంపాదించుట ఒక పక్షమైతే వాటి వినియోగము రెండవ పక్షము. రెండింటి సమన్వయమే సుసంపన్నత. ఎక్కువ సంపద ఉండుటయే సుసంపన్నత అని అనుకుంటూ ఉంటాము. కానీ ఇది పెద్ద భ్రమ. దుర్బుద్ధి ఉన్నప్పుడు సంపద దుష్ట ప్రయోజనాలలో ఉపయోగించబడి ఆ వ్యక్తి, కుటుంబం, సమాజం అనేకానేక కష్టాలకు లోనవుతారు. సంపద రాశి వలన కాక సత్ప్రయోజనాలలో ఉపయోగించే దూరదర్శిత్వము వలననే సాఫల్యం లభిస్తుంది. చక్కగా ఉపయోగించుకుంటే, పరిమిత సంపదయైనా ఆయా అవసరాలను సంతులిత రీతిలో పూర్తి చేసుకోవచ్చు. ప్రసన్నత, సంతుష్టితో కూడిన సద్బుద్ధియే అన్నపూర్ణ అని తెలుస్తుంది.

# 22. మహామాయా

భ్రాంతిని మాయ అంటాము. అధిక భ్రాంతిని మహామాయా అని అంటాము. మాయ పదార్థ సంబంధము. మహామాయ జ్ఞాన పరమైనది. మానవశక్తి పరిమితమైనందున సమగ్ర దర్శనం సాధ్యం కాక, అతని పరిధి ఎంతో అదే సర్వస్వము అని అనుకుంటాడు. కప్ప బావినే సమగ్ర విశ్వమని భావిస్తుంది. దానికే ఆకాశంలో, బ్రహ్మాండీయ ఆకాశంలో చరించేందుకు అవకాశమొస్తే బావే ఆకాశమని అనుకోవటం తప్పని, ఆ సమయంలో అదే తథ్యమని అనిపించినప్పటికి, ఆ కప్పకు తెలిసి వస్తుంది.

జీవి మాయ బంధనాలలో బంధించబడి ఉన్నది. సంకీర్ణ పరిధిలో ఉన్నది. కోరికలు, ఆలోచనలు, క్రియలు ఈ భ్రమ జాలములోనే చిక్కుకున్నందున అవాంఛనీయ స్థితి ఏర్పడుతుంది. కస్తూరి మృగం వలె, తన వద్దనే ఉన్నదానిని ఎక్కడో ఉన్నదని భ్రమించి మృగమరీచికలో దారి తప్పి తిరుగుతూ సంపదను అపవ్యయం చేయుట జరుగుతున్నది. మాయ నుండి విముక్తులగుటకు జిజ్ఞాసులు నిమగ్నులై ఉంటారు. జీవితాన్ని సఫలం చేసే ఉపలబ్ధిగా చెప్పబడే ఆత్మజ్ఞానమే మహామాయా. మాయాబద్ధులు దుఃఖం పొందుతారు. మహామాయ శరణుజొచ్చినవారు పరమశాంతిని రసాస్వాదన చేస్తారు. వారికి శ్రేయోపథం ప్రత్యక్షంగా కన్పిస్తుంది. విముక్తమైన ఆత్మబలంతో ఈ మార్గంలో నడచుట సులభమవుతుంది.

ఆత్మ తనను శరీరమాత్రంగా భావించుట మొదటి భ్రాంతి. ఈ భ్రమతో సుయోగం వలన లభించిన



మానవజన్మను వాసన, తృష్ణ అహం అనే బాల్యక్రీడలలో చిక్కుకొని, పశు ప్రయోజనాలలో పోగొట్టుకొంటున్నాడు. చివరికి వట్టి చేతులతో వీడ్కోలు, పాపపు మూటనెత్తిన మోసుకొని పోవుట, 64 లక్షల (జీవరాసుల) యోనుల క్రమంలో దొరికిన సదవకాశాన్ని పోగొట్టుకొని రోదించుట – ఈ దుర్గతులన్నీ మాయ యొక్క దుష్పరిణామములే. ఈ మహాసంకటాన్నుండి మహామాయ కాపాడుతుంది.

గాయత్రిని మహామాయ అన్నారు. సాధనతో ఆమె అనుగ్రహం సాధకుని అంతరాత్మలో ప్రవేశించి భ్రాంతి రహిత స్థితికి చేరుస్తుంది. ఇదియే దివ్యదృష్టి. జ్ఞానచక్షు ఉన్మీలనం అంటే ఇదే. ఈ స్థితిలోనే జీవన రహస్యం బోధపడుతుంది. పట్టుకొన్న దంతం పండిన ఆకుల్లా రాలి పోతుంది. ఆత్మజాగరణ వలన అన్నీ కొత్తకొత్తగా అన్పించటం, కన్పించటం మొదలవుతుంది. రాత్రి కలల తర్వాత ప్రాతఃకాలం మేల్కొనుట ఏ విధంగా పరిస్థితినంతా మారుస్తుందో అదేవిధంగా మాహామాయ అనుగ్రహం జాగృతి భూమికలోకి ప్రవేశింపజేసి, దేవోపమ స్వర్గీయ ఆనందం లభింపజేసే ఇచ్ఛ, ఆలోచన, క్రియ కలుగుతాయి. బంధన ముక్తితో బ్రహ్మానంద రసానుభూతి నిరంతరం లభించటం మొదలవుతుంది.

మహామాయను పరబ్రహ్మ సమీపంలోకి తీసుకువెళ్ళే నిజమైన దేవమాతగా చెప్పవచ్చు. దేవత్వమే ఆమె అనుగ్రహం. గాయత్రి ఉపాసన ఒక స్థాయిలో మహామాయ రూపంలో సాధకుని దృష్టిని కృతకృత్యం చేయుట కన్పించుచున్నది.

# ౨౩. పయస్విని

గోమాతను పయస్విని అంటారు. స్వర్గంలో నివసించే కామధేనువును కూడా పయస్విని అని అన్నారు. గాయత్రీ సాధనా సాఫల్యానికి సాధకునిలో బ్రాహ్మణత్వము, గోసాన్నిధ్యమునకు అత్యంత కనిష్ఠ సంబంధమున్నది. పంచామృతం పంచగవ్యములు అమృతంతో సమానము. గోమయము, గోమూత్రముల సారము రోగనివారణీశక్తి సర్వవిదితము. భారతీయ వ్యవసాయములో గోవంశం లేకుండా పని జరుగదు. పోషకాహారములో ఆవు పాలకు అగ్రస్థానము. గోవు సంరచనలో ఆది నుండి అంతము వరకు సాత్వికత నిండి ఉన్నది. పయస్విని మహత్యము తెలిసినంతకాలం ఇక్కడ పాలు నదులుగా ప్రవహించేవి, మనుష్యులు శారీరికంగా మానసికంగా దేవతలతో సమానంగా జీవించేవారు.

గాయత్రీ సాధకుని అంతఃకరణలో కామధేనువు అవతరిస్తుంది. వారి కామనలు భావనలుగా మారిపోతాయి. ఫలితంగా సాధకునికి ప్రపంచంలో అన్నింటికంటే పెద్ద కష్టాలు అసంతోషం నుండి సహజ నివృత్తి లభిస్తుంది. కోరికలు అనంతం. ఒకటి నెరవేరితే అంతకంటే పెద్దది మరొకటి ఉత్పన్నం అవుతుంది. ప్రపంచములోని సమస్త సంపద అంతా ఒక మనుష్యుని సంతృప్తి పరచలేదు. సద్భావనలు పూర్ణం కావచ్చు. ఒకవేళ కోరినట్లు కాకపోయినా తన ఇచ్ఛ, చేష్టలలో ఉత్కృష్టత వలన ఆనందం ఉల్లాసం ఉబుకుతూ ఉంటాయి. చింతన యొక్క ఈ స్థాయిని కల్పవృక్షమంటారు. మరొకపేరే కామధేనువు.

గాయత్రీమాత ద్వారా ప్రేరేపించబడిన ఒక ప్రవృత్తియే కామధేనువు. ఇది అంతరాత్మలో ఉన్నతమైన ఆధ్యాత్మిక విశ్వాసము రూపంలో వ్యక్తమవుతుంది. తల్లిపాలు త్రాగే పిల్లవానికి లభించే ఆనందము వంటిదే సాధకునికి లభిస్తుంది. దీనినే ఆత్మానందము, బ్రహ్మానందము పరమానందము అని అంటారు. పూర్ణత్వము యొక్క పరమతృప్తియే జీవన లక్ష్యం. గాయత్రి యొక్క ఉన్నతస్థాయి అనుగ్రహం ఈ రూపంలో లభిస్తుంది. ఈ తృప్తి వరదానమే కామధేనువు యొక్క ఉపలబ్ధి. గాయత్రీ సాధకుడు ఆ దైవీ అనుగ్రహాన్నీ రసాస్వాదన చేస్తూ సాధనా సఫలతను అనుభూతి చెందుతాడు.

గాయత్రి వర్గములో గాయత్రి, గంగా, గోవు, గీతా, గోవిందుడు అనే శ్రేష్ఠతలు ఉన్నాయి. గంగ, గాయత్రి జయంతి ఒక్కరోజే. గోసేవతో కలిపితే అది త్రివేణి అవుతుంది. గాయత్రీ ఉపాసనా సాఫల్యములో గో సంపర్కము అన్నివిధాలా సహాయకారియే. గాయత్రిని కామధేనువు అని అన్నారు. కామధేనువు పయస్విని పర్యాయపదాలే. కామధేను చర్చచేస్తూ శాస్త్రకారులు కల్పవృక్షంతో సమానంగా మనోకామనలు పూర్తిచేసే విశేషత ఉన్నదని



చెప్పారు. కోరికలు అనంతం, వాటిని నెరవేర్చుట భగవంతునికి కూడా సంభవం కాకపోవచ్చు. అయితే కోరికలను పరిష్కరించుట ద్వారా, నెరవేరుట ద్వారా వచ్చే ఆనందాన్ని, ప్రాప్తించుకోవచ్చును.

దేవతలు ఆప్తకాములు, ఎవరి కోరికలు పూర్తిగా నెరవేరాయో వారిని ఆప్తకాములు అంటారు. సద్భావనలు అనదగిన ఉన్నత స్థాయి కామనలే పూర్తి అవుతాయి, తృప్తినిస్తాయి. ఉత్కృష్టచింతన, ఆదర్శ నిర్వహణలో ఎవరికీ ఏ కష్టమూ అనిపించదు. సద్భావనలను ఏ స్థితిలోనైనా చరితార్థం చేయవచ్చు. ఆప్తకామునికే తుష్టి, తృప్తి, శాంతిల ఆనందం లభిస్తుంది. కల్పవృక్షం స్వర్గంలో ఉన్నది. దేవతలు ఆప్తకాములు అవుతారు. కల్పవృక్షం కామనలను పూర్తి చేస్తుంది. దేవత్వము – ఆప్తకామత్వము ఒకటేననే విషయం ఇవన్నీ తెలియజేస్తున్నాయి. అసంతృప్తి యొక్క ఉద్విగ్నత దేవతల దగ్గర తొంగిచూడనైనా చూడదు. లిప్స, లాలస, కామనలు సద్భావనలు, శుభ ఇచ్ఛలుగా మారినప్పుడే ఇదంతా సాధ్యము. కల్పవృక్షము, కామధేనువు రెండింటి విశేషత ఏమంటే కోరికలను వెంటనే నెరవేరుస్తాయి. గాయత్రిని కల్పవృక్షమూ, కామధేనువు అని అంటారు. దాని నీడలో కూర్చున్నవారు, దాని పయఃపానం చేసినవారు ఆప్తకాములవుతారు. కామనలు పరిష్కరించబడి, లాలసలు సమాప్తమైనప్పుడు మనుష్యునికి అంతులేని సంతోషం, అనంత ఆనందం ప్రాప్తిస్తాయి. కథ ఉన్నది. వశిష్ఠుని వద్ద కామధేను పుత్రి నందిని గోవున్నది. అది రాజైన విశ్వామిత్రునికి విందు చేసింది, అతని కుకృత్యానికి దండన కూడ. నందిని ఈ చమత్కారాలు చూసి విశ్వామిత్రుడు రాజ్యం వదలి తపస్సు కోసం వెళ్ళిపోయాడు. ఇది నందిని అనే కామధేనువే.

కామధేనువు పయఃపానం చేసే దేవతలు అజరులు అమరులు అవుతారు. అజర అంటే జరా రహితం, ముసలితనం లేని చిరయవ్వన ఆనందం. శరీర క్రమంలో ఇది సంభవం కాదు. సృష్టిక్రమం ప్రకారం శరీరం జనన మరణచక్రంలో తిరగాలి, సమయానుసారం వృద్ధావస్థ కూడా వస్తుంది. కామధేనువు వలన లభించే ఆరోగ్యం, సౌందర్యం శారీరకం కాదు – అది మానసికము, ఆత్మికమూ. గాయత్రీ ఉపాసకులు కామధేను కృపాపాత్రులై మానసిక దృష్టిలో ఎప్పుడూ యువకులుగా ఉంటారు. వారి ఆశలు, కోరికలు ఎన్నడూ మసకబారవు. కళ్ళల్లో మెరపు, ముఖంలో తేజస్సు, పెదవులపై చిరునగవు ఎన్నడూ చెరగవు. ఇదే చిర యవ్వనం. ఇదే అజర స్థితి. కామధేనువు పయఃపానం చేసేవారు అమరులవుతారు. గాయత్రీ ఉపాసకులు కూడా అమరులవుతారు. శరీరధారణ చేసిన వారు సమయానుసారం మరణించవలసిందే. కానీ ఆత్మజ్ఞానం వలన అమరత్వ అనుభూతి కలిగి ఉంటారు. శరీరం మార్పు అనే భావనే కానీ మరణం అనే బాధ ఉండదు. వారి సత్కర్మలు, ఆదర్శాల వలన కీర్తి ఎలాగూ అమరం అవుతుంది. గాయత్రిని పయస్విని అని ఇందుకు అన్నారు. అలాగే ఈ భూమిపై కామధేనువు అని కూడా పిలుస్తున్నారు.

# 24. త్రిపురా

దక్షిణ మార్గ సాధకులు త్రిపదా అని పిలువగా వామమార్గమువారు త్రిపురా అని సంబోధిస్తారు. త్రిపద కార్యక్షేత్రము సత్యం-శివం-సుందరం-స్వర్గం, ముక్తి, శాంతి, సత్-చిత్-ఆనందం, జ్ఞానం, కర్మ, భక్తి. త్రిపురలో ఉత్పాదన - అభివర్ధన - పరివర్తన - ధనం - బలం - కౌశలం, సాహసం, ఉత్సాహాల పరాక్రమం, ప్రతిభ, ప్రఖరత నిండి ఉన్నాయి. ఆత్మిక ప్రయోజనాలకు త్రిపదను భౌతిక ప్రయోజనాలకు త్రిపురను ఆశ్రయించాలి. యోగము తంత్రము యొక్క ఈ రెండు మార్గాలు ఈ రెండు ప్రయోజనాల కోసం.

సాధనా గ్రంథాలలో త్రిపురా మహాశక్తిని త్రిపుర సుందరి, త్రిపుర భైరవి అని కూడా వ్రాశారు. ఈ రూపాల గురించి అనేక కథలు ఉన్నాయి. దేవీ భాగవతం, మార్కండేయ పురాణంలో వీటి వర్ణన వివేచన ఎంతో ఎక్కువగా ఉన్నది. వాటి ప్రభావము, ప్రయోగాల వర్ణన ఇతర గ్రంథాలలో కూడా దొరుకుతుంది. త్రిపుర భైరవి లీలా ప్రయోజనం అసురవినాశిని, ఆపదనివారణి రూపంలో ఉన్నది. ఆమె భయం గొలిపే రూపము, యుద్ధ ప్రియత్వముతో ఉన్నది. త్రిపుర సుందరి సిద్ధి ధాత్రి, సౌభాగ్యదాయిని, సర్వాంగ సుందర రూపముతో ఉన్నది. భైరవి అభయదానం ఇస్తుంది. సుందరీ అనుగ్రహం లోపల బయట సుఖ సౌందర్యం నింపుతుంది.

మహిషాసురుడు, మధుకైటభులు, శుంభ నిశుంభులు, రక్తబీజుడు, వృత్తాసురుడు మొదలైన అసురులను వధించిన గాథలలో త్రిపురా ప్రచండ పరాక్రమం వర్ణించబడినది. అజ్ఞానము, లేమి, సోమరితనం, నిర్లక్ష్యము పతనము, పరాభవం వంటి సంకటాలే అసురులు. వీటిని త్రిపురా సాహసం పరాక్రమం, ఉత్సాహం అనే త్రిశూలంతో చీల్చివేసి వేస్తుంది. తంత్ర సాంప్రదాయంలో ఈ త్రివిధ సంఘాన్ని దుర్గ-కాళి-కుండలిని అని పిలుస్తారు. వీటినే చండి, మహాశక్తి, అంబ అనే పేర్లతో కూడా పిలుస్తారు. కాళ రాత్రి - మహారాత్రి - మోహరాత్రి రూపంలో హోళి, దీపావళి, శివరాత్రిలలో విశిష్ఠ ఉపాసన చేయబడుతుంది. క్రియాయోగం, జపయోగం, ధ్యానయోగంతో త్రిపద, ప్రాణయోగం, హఠయోగం, తంత్ర యోగంతో త్రిపుర సాధన చేయబడుతుంది. ఒకదానిని యోగాభ్యాసము, రెండవదానిని తపశ్చర్యకు అధిష్ఠాత్రి అని అంటారు.



త్రిపుదాను పరా అని త్రిపురాను అపరా అని అంటారు. రెండింటి సమ్మిళిత సాధనను ప్రాణము - శరీరముల సమన్వయంతో నడిచే జీవనంతో పోల్చవచ్చు. బ్రహ్మవర్చస్ సాధనలో రెండింటిని పరస్పర పూరకములుగా భావించుట జరిగింది. వాటి సంయోగం, సుయోగమును ఓజస్సు - తేజస్సు, బుద్ధి-సిద్ధి, జ్ఞానం-వైభవముల సమన్వయమని చెప్పవచ్చు. ఇవి గాయత్రీ మహాశక్తి యొక్క దివ్యధారలే. వీటిని సాధన ద్వారా వ్యక్తిత్వంలోనికి ఆహ్వానించి, అవతరింపజేసుకోవచ్చు.

## గాయత్రీ మహామంత్రము - భావార్థము

**"ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం
భర్గోదేవస్య ధీమహి ధియో యోనః ప్రచోదయాత్"**

ప్రాణ స్వరూపము, దుఃఖనాశకము, సుఖ స్వరూపము శ్రేష్ఠము తేజస్వి, దేవస్వరూపము, పాపనాశకమై, మా బుద్ధులను సన్మార్గంలో ప్రేరేపించు, ఆ పరమాత్మను అంతరాత్మలో ధరించి, ప్రార్థించెదము.

**వేదమూర్తి తపోనిష్ఠ పండిత శ్రీరామశర్మ ఆచార్యగారి సాహిత్యము, క్యాసెట్లు, స్టిక్కర్లు, మొదలైన వాటి కొరకు సంప్రదించండి.**
**గాయత్రీ చేతనా కేంద్రం, అశ్విని హౌస్ దగ్గర, హెచ్.పి.రోడ్, మూసాపేట, హైదరాబాద్ - 500 018.**
**ఫోన్: 040-23700722, 9949111175**